



అధ్వానంగా ఉన్న వెలుగు కార్యాలయ భవనం

అర్ధాకలితో విద్యార్థులు

ఎలమంచిలి జడ్పీ హైస్కూల్లో అరకొరగా భోజనం

- కొంతమందికి వడ్డించగానే అయిపోయిన అన్నం
- కోడిగుడ్డు కూరదీ అదే పరిస్థితి
- ఆహార సలహా కమిషన్ సభ్యురాలు దేవి సాక్షిగా బయటపడిన నిర్వాకం
- పక్కనే ఉన్న మరో పాఠశాలలో భోజనం వండి వడ్డించిన వైనం
- భోజన పథకం నిర్వాహకులతోపాటు హెచ్‌ఎం, టీచర్లపై ఆగ్రహం
- ముద్దగా అన్నం, ఉడకని బంగాళాదుంపల కూర
- కమిషన్ సభ్యురాలికి విద్యార్థులు ఫిర్యాదు



జడ్పీ ఉన్నత పాఠశాలలో 87 మంది విద్యార్థులకు వండిన అన్నం, సాంబారు, కోడిగుడ్డు కూర ఇవే!



కొంతమందికి వడ్డించగానే అన్నం, కోడిగుడ్డు కూర అయిపోవడంతో ఖాళీ ప్లేట్లతో లైన్‌లో నిల్చున్న విద్యార్థులు

ఎలమంచిలి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి):

విద్యార్థులకు సరిపడ మధ్యాహ్న భోజనం వండలేదు. పిల్లలు భోజనం చేస్తుండగానే అన్నం అయిపోయింది. దీంతో పక్క పాఠశాలలో అన్నం వండించి తీసుకువచ్చా. అప్పటి వరకు విద్యార్థులు ప్లేట్లు పట్టుకుని నిరీక్షించాల్సి వచ్చింది. కొంతమంది విద్యార్థులకే కోడిగుడ్లు పెట్టారు. ఇదంతా పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో వున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యురాలు సాక్షిగా జరిగింది. దీంతో భోజన పథకం నిర్వాహకులు, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయుల తీరుపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకు సంబంధించి వివరాలిలా వున్నాయి.

రాష్ట్ర ఆహార సలహా కమిషన్ సభ్యురాలు జి.దేవి గురువారం మధ్యాహ్నం ఎలమంచిలి పట్టణంలోని కొత్తపేట ఉన్నత పాఠశాలను సందర్శించారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం రైల్వే స్టేషన్ రోడ్డులో ఒకే ప్రాంగణంలో వున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ముందుగా జడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు వండిన మధ్యాహ్న భోజనం వంటకాలను రుచి చూశారు. తరువాత తరగతి గదుల్లోకి వెళ్లి మధ్యాహ్న భోజనం గురించి విద్యార్థులను ఆరా తీశారు. అన్నం ముద్దలా వుంటున్నదని, బంగాళా దుంపలు సరిగా ఉడకడం లేదని, దీంతో భోజనం తినలేకపోతున్నామని, కోడిగుడ్లు అందరికీ పెట్టడంలేదని పలువురు విద్యార్థులు చెప్పారు. అనంతరం విద్యార్థులు భోజనాలకు వెళ్లారు. జడ్పీ ఉన్నత పాఠశాలలో 87 మంది విద్యార్థులకుగాను కొంతమందికి భోజనం వడ్డించిన తరువాత అన్నం, కోడిగుడ్లు అయిపోయాయి. పక్కనున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కూడా ఇదే పరిస్థితి ఏర్పడింది. దీంతో అప్పటికప్పుడు భోజన పథకం నిర్వాహకులు అన్నం, కూర వండి సుమారు అర గంట తరువాత విద్యార్థులకు భోజనం పెట్టారు. ఇదంతా గమనిస్తున్న ఆహార కమిషన్ సభ్యురాలు దేవి.. సంబంధిత భోజన పథకం నిర్వాహకులు, హెచ్‌ఎం, ఉపాధ్యాయులపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. విద్యార్థులకు రోజూ ఇలాగే భోజనం పెడుతున్నారా? అంటూ ఆగ్రహంతో ప్రశ్నించారు. భోజన పథకం నిర్వాహకులు, ఉపాధ్యాయులు పొంతన లేని సమాధానాలు చెప్పడంతో ఆమె మండిపడ్డారు. రోజూ విద్యార్థులకు వడ్డించే భోజనాన్ని రుచి చూడాల్సి బాధ్యత ఉపాధ్యాయులపై వుందని, కానీ ఇక్కడ ఆ విధంగా జరగడం లేదని ఆమె అభిప్రాయపడ్డారు. ఉపాధ్యాయులు బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. అనంతరం భోజన పథకం స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. బీరువాను తెరిపించి చూడగా రెండు ట్రేలలో కోడిగుడ్లు కనిపించాయి. విద్యార్థులకు కోడిగుడ్లు పెట్టకుండా ఇక్కడ దాచారేమిటని ఆమె ప్రశ్నించగా, భోజన పథకం నిర్వాహకుల నుంచి ఎటువంటి సమాధానం రాలేదు. జడ్పీ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ తీరుపై ప్రభుత్వానికి నివేదిస్తానని ఆహార కమిషన్ సభ్యురాలు దేవి చెప్పారు. ఆమె వెంట జిల్లా పౌరసరఫరాల అధికారి కేవీఎల్ఎన్ మూర్తి, పౌరసరఫరాల జిల్లా మేనేజరు జయంతి, ఎంఈవో అరుణ్‌కుమార్ వున్నారు.



భోజన పథకం నిర్వాహకులు, హెచ్‌ఎంపై అసహనం వ్యక్తం చేస్తున్న రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యురాలు జి.దేవి

పోలవరం ఎనిమిదో ప్యాకేజీ పనుల్లో కదలిక

- అనకాపల్లి, మునగపాక మండలాల్లో 15.7 ఎకరాల సేకరణకు చర్యలు
- పిసినికాడ నుంచి నాగులాపల్లి వరకు కాలువ తవ్వకం
- పనులు పూర్తయితే 50 వేల ఎకరాలకు సాగునీరు

అనకాపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి):

పోలవరం ఎడమ కాలువ ఎనిమిదో ప్యాకేజీకి భూసేకరణకు అధికారులు చర్యలు చేపట్టారు. అనకాపల్లి, మునగపాక మండలాల్లో సుమారు 15.7 ఎకరాలను సేకరించనున్నారు.

పోలవరం ఎడమ ప్రధాన కాలువకు సంబంధించి జిల్లాలో ఆరు, ఏడు ప్యాకేజీల కింద గతంలోనే పనులు చేపట్టిన విషయం తెలిసిందే. అయితే వైసీపీ ప్రభుత్వ హయాంలో అన్ని పనులు నిలిచిపోయాయి. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత కేంద్రం నుంచి నిధులు మంజూరు చేయించి, మిగిలిన పనులకు టెండర్ల ప్రక్రియను కూడా పూర్తి చేసింది. ఇదిలా వుండగా పోలవరం నీటిని విశాఖకు తరలించడానికి, ఇదే సమయంలో అనకాపల్లి, మునగపాక మండలాల్లో సుమారు 50 వేల ఎకరాలకు నీరు అందించడానికి గత టీడీపీ హయాంలోనే ఎనిమిదో ప్యాకేజీ ప్రకటించారు. ఇందులో భాగంగా తాళ్లపాలెం నుంచి అనకాపల్లి మండలం పిసినికాడ వరకు ఏలేరు కాలువను గతంలోనే విస్తరించారు. ఇక్కడ నుంచి కణితి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ వరకు విస్తరించాల్సి వుంది. కాగా పోలవరం నీటిని అనకాపల్లి, మునగపాక మండలాలకు అందించేందుకు పిసినికాడ వద్ద ఏలేరు కాలువ నుంచి తూర్పు వైపునకు మునగపాక మండలం నాగులాపల్లి వరకు నాలుగున్నర కిలోమీటర్ల మేర కాలువ తవ్వాలి. దీనివల్ల రెండు మండలాల్లో సుమారు 50 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఈ కాలువ తవ్వకానికి అవసరమైన 15.7 ఎకరాలను సేకరించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

వెలుగు ఆరిపోతోంది!

శిథిలావస్థలో కార్యాలయ భవనం

- బీటలు వారిన కాంక్రీట్ పిల్లర్లు, గోడలు
- శ్లాబ్ పెచ్చులూడిపోయి బయటకు కనిపిస్తున్న ఇనుప ఊచలు
- ఎప్పుడు కూలిపోతుందోనని ఉద్యోగుల ఆందోళన
- బిక్కుబిక్కుమంటూ విధుల నిర్వహణ



పెచ్చులు ఊడిపోయిన కారిడార్ శ్లాబ్

చోడవరం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి):

మహిళల జీవితాల్లో వెలుగులు నింపే కార్యాలయానికే వెలుగు కొరవడింది. చోడవరంలోని వెలుగు కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరి, ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితిలో వుంది. దీంతో ఉద్యోగులు బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు.



మెట్ల కింద ఊడిపోయిన కాంక్రీట్, బయటకు కనిపిస్తున్న ఇనుప ఊచలు

చోడవరం నుంచి అంకుపాలెం వెళ్లే మార్గంలో డీఆర్‌డీఏ వెలుగు కార్యాలయం వుంది. రెండు అంతస్థుల్లో వున్న ఈ భవనాన్ని సుమారు రెండున్నర దశాబ్దాల క్రితం నిర్మించారు. అయితే పనుల్లో నాణ్యత లోపించడంతోపాటు చిన్నపాటి మరమ్మతులు సైతం చేయలేదు. దీంతో శ్లాబ్ పెచ్చులు ఊడిపోయి ఇనుప ఊచలు బయటకు కనిపిస్తున్నాయి. గోడలతోపాటు కాంక్రీట్ పిల్లర్లు సైతం బీటలు వారాయి. గోడల ప్లాస్టరింగ్ పెచ్చులు ఊడిపోతున్నాయి. పై అంతస్థు ఇప్పటికే పూర్తిగా దెబ్బతినగా, కింద అంతస్థు పరిస్థితి కూడా ఇంచుమించు అలాగే వుంది. దీంతో ఉద్యోగులు, వివిధ పనుల నిమిత్తం వచ్చే డ్వాక్రా మహిళలు భయాందోళన చెందుతున్నారు. వెలుగు కార్యాలయం పక్కనే ఉన్న ఫ్యాషన్ టెక్నాలజీ భవనం చుట్టూ తుప్పలు పెరిగి కార్యాలయంలోకి పాములు విషకీటకాలు వస్తున్నట్టు ఉద్యోగులు చెబుతున్నారు. దీనికితోడు కార్యాలయానికి ఆనుకుని ఆర్టీసీ కాంప్లెక్స్ పాత చెరువు నుంచి భరించ లేదని దుర్గంధం వెలువడుతున్నది. శిథిలమైన భవనంలో ఒకపక్క భయపడుతూ, మరోపక్క దుర్గంధం భరిస్తూ విధులు నిర్వహించవలసి వస్తున్నదని ఉద్యోగులు వాపోతు న్నారు.

అందుబాటులోకి రాని నూతన భవనం

వెలుగు కార్యాలయానికి ఏడేళ్ల క్రితం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో స్త్రీశక్తి భవనం నిర్మించారు. అయితే భారీ వర్షాలతో తహసీల్దార్ కార్యాలయ భవనం పూర్తిగా దెబ్బతినడంతో, వెలుగు కార్యాలయం కోసం నిర్మించిన భవనంలో రెవెన్యూ కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. మరోవైపు రెవెన్యూ కార్యాలయం కోసం ఆరేళ్ల క్రితం చేపట్టిన నూతన భవన నిర్మాణం అసంపూర్తిగా ఉండిపోవడంతో స్త్రీశక్తి భవనాన్ని వెలుగు శాఖకు అప్పగించడంలేదు. రెవెన్యూ కార్యాలయం భవన నిర్మాణం పూర్తయితే తప్ప వెలుగు స్త్రీ శక్తి భవనానికి విముక్తి కలిగేలేదు. ప్రస్తుతం ఉన్న వెలుగు భవనం అంతవరకు వుంటుందా అన్న సందేహం వ్యక్తం అవుతున్నది. ఇటీవల మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, రెవెన్యూ కార్యాలయ భవన నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, త్వరగా పనులు పూర్తి చేయించి వెలుగు కార్యాలయానికి సొంత భవనం అప్పగిస్తామని హామీ ఇచ్చారు. రెవెన్యూ భవనం ఎప్పుడు పూర్తవుతుందో, స్త్రీశక్తి భవనం తమకు ఎప్పుడు అప్పగిస్తారో అనివెలుగు ఉద్యోగులు ఎదురు చూస్తున్నారు.

కరక కథ కంచికేనా!

రంగురాళ్ల క్వారీలోకి మైనింగ్ సిబ్బందితో పాటు ప్రైవేటు వ్యక్తులు అక్రమ చొరబాటు

- అటవీ శాఖ అనుమతులు లేకుండా రిజర్వు ఫారెస్టులో సంచారం
- అడ్డుకున్న సిబ్బంది, రేంజర్‌కి సమాచారం
- చొరబాటుదారులకు గత నెలలో నోటీసులు
- వివరణ సరిగా లేదంటూ వారం క్రితం మరోసారి నోటీసులు
- తెరవెనుక పెద్దలు ఉండడంతో చర్యలకు వెనకడుగు



గొలుగొండ మండలం కరక రిజర్వు అటవీ ప్రాంతం (ఫైల్ ఫొటో)

నర్సీపట్నం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి):

గొలుగొండ మండలం కరక రంగురాళ్ల క్వారీలోకి అనుమతులు లేకుండా సర్వేకి వెళ్లిన మైనింగ్ అధికారులపై అటవీ అధికారులు చర్యలు తీసుకోకుండా షోకాజ్ నోటీసులతో తాత్సారం చేస్తున్నారు. ఇద్దరు రంగురాళ్ల వ్యాపారులతోపాటు మైనింగ్ అధికారులను కరక రిజర్వ్ ఫారెస్టులోకి పంపిన పెద్దలు ఎవరు? ఎందుకు సర్వే చేయాలని అనుకున్నారు? అన్న విషయాలు బయటకు పొక్కడం లేదు.

మైనింగ్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ సత్యమూర్తి, మైనింగ్ జియాలజీ విభాగానికి చెందిన పోతి శివకుమార్, సిబ్బంది కూర్మదాసు అప్పలనాయుడు, వి.వీరనాగేశ్వరరావు, జి.రామచంద్రరావు జనవరి 31వ తేదీన గొలుగొండ మండలం సాలికమల్లవరం గ్రామానికి చెందిన రంగురాళ్ల వ్యాపారులు కె.కొండలరావు, అల్లు నూకరాజులతో కలిసి రిజర్వ్‌ఫారెస్టు పరిధిలోని కరక కొండ ఎక్కారు. కొండ మీద బేస్ క్యాంప్ సిబ్బంది వారిని అడ్డుకొని నర్సీపట్నం రేంజర్‌కి సమాచారం ఇచ్చారు. మైనింగ్ అధికారులతో సహా ఇద్దరు ప్రైవేటు వ్యక్తులను రేంజ్ కార్యాలయానికి తరలించారు. రెండు రోజులపాటు విచారణ చేశారు. అమరావతిలోని గనులు, భూగర్భ శాఖ ఓఎస్‌డీ ఆదేశాలతోనే కొరక కొండ మీదకు రాయల్టీ ఇన్‌స్పెక్టర్‌ని, సిబ్బందిని కరక కొండ మీదకు పంపాని నర్సీపట్నం మైనింగ్ ఏడీ మీడియాకు చెప్పడం సంచలనంగా మారింది. దీనినిబట్టి కరక రంగురాళ్ల తవ్వకాలకు పెద్దస్థాయిలోనే ప్రయత్నాలు జరుగుతున్నట్టు తెలిసింది. రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో ఉన్న కరక కొండను డీనోటిపై చేయడానికి పెద్దలు ప్రయత్నిస్తున్నారని ప్రచారం

... మిగతా 6వ పేజీలో



క్రషింగ్ బ్రేక్‌తో యార్డులో ఉన్న చెరకు బళ్లు

గోవాడ షుగర్స్‌లో మళ్లీ ఆగిన క్రషింగ్

- చెరకు బండ్లు, ట్రాక్టర్లతో నిండిపోయిన యార్డు

చోడవరం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి):

గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో క్రషింగ్‌కు మరోసారి అంతరాయం ఏర్పడింది. బుధవారం అర్ధరాత్రి తరువాత టర్బయిన్‌లో తలెత్తిన సాంకేతిక లోపంతో క్రషింగ్ ఆగిపోయింది. అధికారులు రంగంలోకి మరమ్మతు పనులు చేపట్టారు. గురువారం సాయంత్రానికి కూడా క్రషింగ్ పునఃప్రారంభం కాలేదు. యార్డు మొత్తం చెరకు బండ్లు, ట్రాక్టర్లతో నిండిపోయింది. కాటా వద్ద కూడా ఇంచుమించు ఇదే పరిస్థితి నెలకొంది. సాంకేతిక సమస్యలతో చెరకు క్రషింగ్ తరచూ ఆగిపోతుండడంతో రైతులు తీవ్ర అసహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఫ్యాక్టరీకి ఆర్థికంగా ఇబ్బందికర పరిస్థితి ఏర్పడింది.

ఏయూ మాజీ వీసీపై విచారణ



వైసీపీ హయాంలో ప్రసాదరెడ్డి సాగించిన అడ్డగోలు వ్యవహారాలను అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యేలు పల్లా, వెలగపూడి, విష్ణుకుమార్‌రాజు

- విజిలెన్స్‌తో విచారణ జరిపిస్తామని మంత్రి నారా లోకేశ్ ప్రకటన
- మాజీ వీసీపై అనేక ఆరోపణలు
- ఇష్టారాజ్యంగా నియామకాలు, అస్మదీయులకు కీలక పదవులు, నిధులు దుర్వినియోగం, పీహెచ్‌డీ ప్రవేశాల్లో నిబంధనల ఉల్లంఘన...
- వీసీ కార్యాలయాన్ని వైసీపీ ఆఫీస్‌గా మార్చేశారనే విమర్శలు

విశాఖపట్నం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి):

ఆంధ్ర విశ్వవిద్యాలయం మాజీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీవీజీడీ ప్రసాదరెడ్డి అక్రమాలు, అడ్డగోలు నిర్ణయాలపై ప్రభుత్వం విచారణ జరి పించేందుకు సిద్ధమైంది. వైసీపీ హయాంలో ప్రసాదరెడ్డి తీసుకున్న నిర్ణయాలు, చేపట్టిన నియామకాలు, నిధుల దుర్వినియోగం ఆరోపణ లపై విచారణ నిర్వహించాలన్న డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. ఈ నేపథ్యంలో గురు వారం అసెంబ్లీలో నగరానికి చెందిన ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, పల్లా శ్రీనివాసరావు, విష్ణుకుమార్‌రాజులు ప్రసాదరెడ్డి హయాంలో వర్సిటీలో జరిగిన అక్రమాలు, అడ్డగోలు వ్యవహా రాలపై ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు కావస్తున్నా విచారణ జరపకపోవడంపై ప్రశ్నించారు. ఎమ్మెల్యేల ప్రశ్నలపై మంత్రి నారా లోకేష్ స్పందిస్తూ ప్రసాదరెడ్డి హయాంలో ఏయూలో జరిగిన అవినీతి, అక్రమాలపై 60 రోజుల్లో విజిలెన్స్ విచారణ పూర్తిచేసి, చర్యలు తీసు కుంటామని ప్రకటించారు. సుమారు రూ.20 కోట్ల రూసా నిధులు దుర్వినియోగం చేశారని, ఇస్రో నుంచి వచ్చిన రూ.25 లక్షల వ్యయంలో కూడా నిబంధనలు ఉల్లంఘించారని ఫిర్యాదు అంది నట్టు మంత్రి తెలిపారు.

మాజీ వీసీ వ్యవహారాలపై ఇన్‌చార్జి వీసీ నియమించిన కమిటీ కూడా విచారణ జరిపినట్టు తెలిపారు. విజిలెన్స్ నివేదిక వచ్చిన వెంటనే బాధ్యులైన వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తా మని స్పష్టంచేశారు. మంత్రి ప్రకటనపై వర్సిటీలో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. అడ్డగోలు వ్యవహారాలన్నీ బయటకు

... మిగతా 6వ పేజీలో

పకడ్బందీగా పది పరీక్షలు



అధికారులతో సమావేశమైన కలెక్టర్ విజయకృష్ణన్

- 107 కేంద్రాలు, 21 వేల మంది విద్యార్థులు
- ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం

అనకాపల్లి కలెక్టరేట్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి):

వచ్చే సోమవారం నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. పరీక్షల నిర్వహణకు ముందస్తు ఏర్పాట్లలో భాగంగా గురువారం కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ నెల 17వ తేదీ నుంచి ఏప్రిల్ ఒకటో తేదీ వరకు 107 సెంటర్లలో నిర్వహిస్తున్న పదో తరగతి పరీక్షలకు జిల్లా నుంచి సుమారు 21 వేల మంది విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు. అధికారులంతా సమన్వయంతో పనిచేస్తూ, ఎక్కడా ఎటువంటి సమస్యలు తలెత్తకుండా పరీక్షలు సజావుగా జరిగేలా ఏర్పాట్లు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని విద్యా శాఖ అధికారులను ఆదేశించారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు ముందుగానే చేరుకునేలా బస్సులను ఏర్పాటు చేయాలని పీటీడీ అధికారులకు సూచించారు. పరీక్షలు జరుగుతున్న సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని ఈపీడీసీఎల్ అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులకు స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని, పరీక్షా కేంద్రాలకు దగ్గరలో వున్న జెరాక్స్ సెంటర్లను పరీక్షల సమయంలో మూసివేయాలన్నారు. ప్రశ్నాపత్రాల తరలింపు, తనిఖీ బృందాలకు ఎస్కార్ట్, పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులకు తెలిపారు. పరీక్షల నిర్వహణ అనంతరం జవాబు పత్రాల బండిళ్లను వ్యాల్యుయేష్ కేంద్రానికి సకాలంలో పంపించడానికి పరీక్షల నిర్వహణ అధికారులకు తపాలా శాఖ సిబ్బంది సహకరించాలని కలెక్టర్ తెలిపారు. సమస్యాత్మక కేంద్రాల్లో అదనపు భద్రతా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో జిల్లా ఎన్నికల సహాయ కమిషనర్ శ్రీధర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (శుక్ర) 6.11

సహరి (శని) 4.51



నిర్మానుష్యంగా మారిన రాంబిల్లి ఎన్ఏవోబీ రోడ్డు

ఠారెత్తించిన ఎండ

- ఒక్కసారిగా పెరిగిన ఉష్ణోగ్రతలు
- అనకాపల్లిలో 38.3 డిగ్రీలు నమోదు

అనకాపల్లి టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలో ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పెరిగాయి. గురువారం ఎండ ఠారెత్తించింది. బుధవారంతో పోలిస్తే మూడు నుంచి ఐదు డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు పెరిగాయని అనకాపల్లిలోని ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు వెల్లడించారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు రహదారులపై జనసంచారం తగ్గి పోయింది. మధ్యాహ్నం కొంతసేపు వేడిగాలులు వీచాయి. అనకా పల్లిలో బుధవారం 35.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదుకాగా 38.3 డిగ్రీలకు పెరిగింది. ఒక్క రోజులోనే సుమారు మూడు డిగ్రీలు పెరగడంతోపాటు వేడి గాలులు వీచడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

20 ఎకరాల్లో సరుగుడు తోట దగ్ధం

గొలుగొండ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లంకి గ్రామ శివా రులోని సరుగుడు తోటలో అగ్నిప్రమాదం సంభవించి సుమారు 20 ఎకరాల్లో తోటలు కాలిపోయాయి. బుధవారం రాత్రి ఏడు గంటల సమయంలో సరుగుడు తోటల్లో నుంచి మంటల ఎగిసిపడుతుండడంతో పలువురు రైతులు అక్కడకు వెళ్లి మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. నలుగురు రైతులకు చెందిన 20 ఎకరాల్లో రెండేళ్ల క్రితం వేసిన సరుగుడు తోటలతోపాటు మరో రైతుకు చెందిన వరి కుప్ప దగ్ధమయ్యాయి. వీఆర్వో పడాల్ గురువారం వీటిని పరిశీలించి, నష్టం అంచనా వేశారు. అధికారులకు నివేదిస్తానని చెప్పారు.

మత్స్యకార సంక్షేమ సమితి గ్రామ కమిటీల ఏర్పాటు

నక్కపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నక్కపల్లి సహా తీరప్రాంతం వున్న అన్ని మండలాల్లో మత్స్యకార సంక్షేమ సమితి గ్రామ, మండల కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని సమితి రాష్ట్ర అధ్యక్షుడు ముడి మహేశ్ చెప్పారు. గురువారం మండలంలోని తీర గ్రామాల్లో పర్యటించారు. పలువురు మత్స్యకార నాయకులను కలిశారు. విద్యావంతులు, చురుకైన వారికి కమిటీల్లో ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఆయన వెంట వాసుపల్లి శివ, కారే రాజు, చోడిపల్లి అప్పలరాజు, గనగాల రాంబాబు, మైలపల్లి ప్రసాద్, గరికిన రాజేశ్, కోడ శివాజీ వున్నారు.

రాజయ్యపేటలో వైద్య శిబిరం

నక్కపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజయ్యపేటలో గురువారం ఐద్వా ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బీపీ, షుగర్, క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధులకు సంబంధించి పరీక్షలు నిర్వహించి, మెడికవర్ వైద్యులు రోగులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి డి. వరలక్ష్మి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.అప్పలరాజు, ఎం.రాజేశ్, సత్యనారాయణ, శ్రీనివాసరావు, మహేశ్, దావీద్ రాజు,భైరాగి రాజు పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు

పాయకరావుపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు గురువారంతో ప్రశాంతంగా ముగిశాయి. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీప్రకాష్ విద్యా సంస్థలు, కార్తికేయ జూనియర్ కళాశాలలో ఈనెల 1వ తేదీ నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రాంభమయ్యాయి. ఈ కేంద్రాల్లో 1,240 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. గురువారంతో ముగిసిన ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని పరీక్షల నిర్వాహకులు తెలిపారు.

సీతారాముల విగ్రహాలకు పూజలు

మునగపాక, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక దళితవాడలో ఈనెల 15వ తేదీన ప్రతిష్ఠాపన సీతారామలక్ష్మణ విగ్రహాలకు గురువారం పూజలు నిర్వహించారు. ధాన్యంలో ఉంచిన విగ్రహాలను ప్రత్యేక యాగశాలలో బయటకు తీశారు. వేద పండితులు వాటికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శనివారం రామాలయంలో విగ్రహాలను ప్రతిష్ఠిస్తామని ఉత్సవ కమిటీ తెలిపింది. వాటితో పాటు ఆంజనేయ, షిర్డీసాయినాథ్ విగ్రహాలను కూడా ప్రతిష్ఠించనున్నారు.

మార్కెట్ సంత వేలం పాట రేపు

ఎలమంచిలి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలో ఈనెల15వ తేదీన ఉదయం 11.30 గంటలకు మార్కెట్ సంత ఆశీలు పాట, కబేళా పాట నిర్వహించనున్నట్టు కమిషనర్ ప్రసాదరాజు తెలిపారు. ఈ వేలం పాటలో అధిక సంఖ్యలో పాటదారులు పాల్గొని, మునిసిపాలిటీ అభివృద్ధికి సహకరించాలన్నారు.

నేడు ఎలమంచిలిలో ట్రాఫిక్ ఆంక్షలు

ఎలమంచిలి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దిమిలి రోడ్డు జంక్షన్ వద్ద శుక్రవారం సీతారామ చంద్రస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం సందర్భంగా పట్టణంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్టు పట్టణ పోలీసులు తెలిపారు. ఆలయం వద్ద అన్నసమరాధన ఏర్పాటు చేశారు. పట్టణంలో ఎల్ఐసీ కార్యాలయం నుంచి దిమిలి రోడ్డు జంక్షన్ వరకూ ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ వాహనాలను దారిమళ్లిస్తున్నట్టు చెప్పారు. ఎలమంచిలి ఆర్టీసీ బస్టాండ్ నుంచి అనకాపల్లి వైపు వెళ్లే వాహనాలు రైల్వే స్టేషన్ రోడ్డు నుంచి ఎల్ఐసీ కార్యాలయం పక్క రోడ్డు గూండా వెళ్లాలన్నారు. అనకాపల్లి నుంచి ఎలమంచిలి ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చే వాహనాలు రేగుపాలెం హైవే మీదుగా ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకోవాలని పోలీసులు తెలిపారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

నక్కపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఈనెల 24న హోం మంత్రి వంగలపూడి అనిత బర్త్‌డే పురస్కరించుకుని స్థానిక హెటిరో ఔషధ పరిశ్రమ మైదానంలో క్రికెట్ టోర్నమెంట్ గురువారం ప్రారంభించారు. నియోజకవర్గం పరిధిలో 50 జట్లు ఈ టోర్నమెంట్‌లో పాల్గొంటున్నాయి. తొలి రోజు టోర్నమెంట్‌కు హాజరైన క్రీడాకారులను నియోజకవర్గ టీడీపీ నాయకులు పరిచయం చేసుకున్నారు. పది రోజుల పాటు ఈ పోటీలు జరుగుతాయి. ఛాంపియన్‌గా నిలిచిన జట్టుకు రూ.1 లక్ష నగదు బహుమతిని ప్రకటించారు.

టెన్త్ విద్యార్థులకు హాల్ టిక్కెట్లు పంపిణీ

నక్కపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ హైస్కూల్‌లో టెన్త్ విద్యార్థులకు గురువారం హెచ్ఎం రాణీలలిత హాల్ టిక్కెట్లు పంపిణీ చేశారు. కేవీపాలెం హాస్టల్ ఇన్‌ఛార్జి ప్రవీణ్ రత్నకుమార్ అట్టలు, పెన్నులు, పౌచ్‌లు విద్యార్థులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు టీవీ రమణ, సత్యవతి, సుందరరావు, జాన్సీరాణీ, పద్మావతి, ఎస్‌వీఎస్ ఆచార్యులు పాల్గొన్నారు.

మండిన సూరీడు

- హడలిపోతున్న ప్రజలు
- నిర్మానుష్యంగా మారిన రోడ్లు, జంక్షన్లు

రాంబిల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): గత కొద్ది రోజులుగా సూర్యుడు ఉగ్రరూపాన్ని చూపిస్తున్నాడు. గురువారం అధిక ఉష్ణోగ్రత నమోదు కావడంతో అత్యవసర పనులపై వచ్చేవారు అల్లాడిపోయారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండ తీవ్రతకు ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాని పరిస్థితి నెలకొంది. ఎండలు రోజు, రోజుకు ముదురుతుండటంతో ప్రజలు మరింతగా భయాందోళన చెందుతున్నారు. ఇళ్లలో ఉన్న వృద్ధులు, చంటి పిల్లల తల్లులు, చంటి పిల్లలు, అనారోగ్యాలతో బాదపడే రోగులు నానా ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం జనసంచారంతో రద్దీగా ఉండే ప్రధాన జంక్షన్లు, వాహనాలు రాకపోకలతో రద్దీగా ఉండే ప్రధాన రోడ్లు నిర్మానుష్యంగా మారిపోతున్నాయి. ఎండ తీవ్రతకు ప్రయాణాలు చేసేందుకు ప్రజలు ఇష్టపడడం లేదు. ఉపాధి పనులు చేసుకొనే వేతనదారులు ఎండ తీవ్రతకు అల్లాడిపోతున్నారు. పశువుల పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారిందని, పాల దిగుబడి కూడా తగ్గిపోయిందని పాడిరైతులు చెబుతున్నారు. కాగా ఎండ తీవ్రత కారణంగా గ్రామాల్లో శీతలపానీయాలకు మంచి గిరాకీ ఏర్పడింది.

అచ్యుతాపురం రూరల్‌లో..

భానుడు ప్రతాపానికి ప్రజలు హడలిపోతున్నారు. గురువారం మండలంలో అత్యధికంగా 35 సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. దీంతో అత్యవసర పరిస్థితుల్లో తప్ప ఎవరూ బయటకు రాలేదు. ఉదయం 10 గంటలకు 31 డిగ్రీల ఉష్ణోగ్రత ప్రారంభమై మధ్యాహ్నానికి 35 డిగ్రీలకు చేరుకుంది. దీంతో సాయంత్రం వరకూ రాకపోకలకు వ్యాపారాలు మందకొడిగా సాగాయి. జ్యూస్ షాపులు, పాన్‌షాపులు, కొబ్బరిబొండాల షాపులు కిటకిటలాడాయి.



నిర్మానుష్యంగా మారిన రాంబిల్లి జంక్షన్ రోడ్డు

నేత్రపర్వంగా వెంకన్న తోటోత్సవం

నక్కపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపమాక క్షేత్రంలో శ్రీవారి వార్షిక కల్యాణోతవాల్లో భాగంగా గురువారం సాయంత్రం కల్యాణ వేంకటేశ్వరుడి తోట ఉత్సవం నేత్రపర్వంగా సాగింది. ఉభయదేవేరులతో కూడిన స్వామివారిని రాజాధిరాజ వాహనంపై అలంకరించారు. ఇక్కడకు 2 కిలోమీటర్ల దూరంలో వున్న సీహెచ్‌ఎల్‌పురం గ్రామం సమీపంలో వున్న తోటలోకి స్వామివారిని తీసుకెళ్లారు. అక్కడ వున్న రాతిమండపంలో కల్యాణ వేంకటేశ్వరుడికి ఆలయ ప్రధానార్చకులు ప్రసాదాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. తదుపరి మాడవీధుల్లో రాజాధిరాజ వాహనంపై స్వామివారు ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.



సీహెచ్‌ఎల్‌పురం తోటలోకి స్వామివారిని తీసుకెళ్తున్న దృశ్యం



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరామచంద్ర మూర్తి

సారా రహిత రాష్ట్రంగా ఏపీ

- ప్రొహిబిషన్, ఎక్సైజ్ డీసీ శ్రీరామచంద్ర మూర్తి

అచ్యుతాపురం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): సారా రహిత రాష్ట్రంగా తయారుచేయడానికే నవోదయం-2.0 కార్యక్రమాన్ని రూపొందించామని ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ విశాఖపట్నం జోన్ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీరామచంద్ర మూర్తి అన్నారు. గురువారం పూడిమడకలో సారాకు వ్యతిరేకంగా జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ సారా తయారీ, రవాణా, విక్రయం చట్టరీత్యా నేరమన్నారు. పట్టుబడిన వారికి కఠినంగా శిక్షిస్తామన్నారు. సారాకు సంబంధించి 14405 టోల్‌ఫ్రీ నంబరుకు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి వి. సుధీర్, ఎలమంచిలి ఎక్సైజ్ సీఐ తేజో వెంకట కుమార్, ఎస్ఐలు సుధాకర్, వెంకటరావు, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థినులకు పరీక్ష సామగ్రి వితరణ

ఎస్.రాయవరం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి మండలం లైనుకొత్తూరులో గల న్యూలైఫ్ చిల్డ్రన్ హోమ్ (షీబా) ఆధ్వర్యంలో గురువారం ఎస్ రాయవరం జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థినులకు పరీక్ష రాయడానికి అవసరమైన అట్టలు, పెన్నులు, ఇతర సామగ్రిని ఆ సంస్థ ప్రతినిధులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు రాజు కులపతి, నీలిమ, భీమరాజు, కృష్ణ ప్రసాద్, యేసుబాబు, ఉపాధ్యాయులు వీసం ప్రసాద్, సాధిక్, రామునాయుడు, అప్పారావు, సత్యవతి, అరుణకుమారి, విజయలక్ష్మి పాల్గొన్నారు.



విద్యార్థినులకు పరీక్ష సామగ్రి అందజేస్తున్న దృశ్యం

పూడిమడక మద్యం దుకాణంలో చోరీ

- రూ.2.7 లక్షల నగదు అపహరణ

అచ్యుతాపురం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పూడిమడకలో బుధవారం రాత్రి ఓ మద్యం దుకాణంలో చోరీ జరిగింది. దుకాణంలోని క్యాష్ బాక్సులో ఉన్న రూ.2.7 లక్షల నగదు అపహరణకు గురైంది. దీనిపై దుకాణ యజమాని రాజు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. షాపు యజమాని తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక శ్మశాన వాటిక సమీపంలో మద్యం దుకాణం ఉంది. ఈ షాపు సిబ్బంది బుధవారం రాత్రి 10 గంటలకు షాపును మూసివేశారు. అప్పటి వరకు విక్రయించగా వచ్చిన డబ్బును షాపులోనే ఉంచారు. ఆ నగదును గురువారం ఉదయం దుకాణ యజమాని రాజుకు అప్పగించాల్సి ఉంది. అయితే బుధవారం అర్ధరాత్రి దాటిన తరువాత ఓ దుండగుడు ముఖానికి ముసుగు వేసుకుని షాపు షట్టర్ తొలగించి లోపలికి ప్రవేశించాడు. వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేశాడు. దీంతో షాపు లోపలి దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు కాలేదు. కాగా షాపులోని రూ.2.7 లక్షల నగదు చోరీకి గురైందని, మద్యం బాటిళ్లను దుండగుడు తీసుకువెళ్లలేదని షాపు యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

విశాఖపట్నం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కూర్మన్నపాలెం సమీపంలోని స్టీల్ సిటీ ఆర్టీసీ డిపో జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దువ్వాడ సమీపాన కొత్తూరులో నక్కా కృష్ణ (45), ద్రోణాద్రి రాంబాబులు కుటుంబాలతో నివాసముంటున్నారు. స్టీలుప్లాంటులో కూలీ పనులకు వెళుతుంటారు. బుధవారం రాత్రి సీ షిఫ్ట్ డ్యూటీకి వెళ్లి గురువారం ఉదయం ఒకే ద్విచక్ర వాహనంపై ఇంటికి తిరిగి వస్తుండగా కూర్మన్నపాలెం వద్ద అనకాపల్లి నుంచి గాజువాక వైపు అతి వేగంగా వెళుతున్న టిప్పర్ వెనుక నుంచి బలంగా ఢీకొంది. దీంతో బైక్‌పై ఉన్నవారు.. ఆ సమయంలో పక్కనుంచి వెళుతున్న బస్సు కిందపడడంతో సంఘటనా స్థలంలోనే మృతిచెందారు. ఈ ప్రమాదంలో రోడ్డుపై వెళుతున్న పి.శ్రీను అనే అతను తీవ్రంగా గాయపడ్డాడు.

బోదకాలు నివారణపై జాగ్రత్తలు అవసరం

అచ్యుతాపురం రూరల్, మార్చి 13, (ఆంధ్రజ్యోతి): బోదకాలు నివారణకు పలు జాగ్రత్తలు తీసుకోవాలని హరిపాలెం వైద్యాధికారులు మానస, రవిబాబు అన్నారు. మండలంలోని హరిపాలెం పీహెచ్‌సీలో గురువారం బోదకాలు అవగాహనపై కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా క్యూలెక్స్ దోమ కారణంగా బోదకాలు వ్యాప్తి చెందుతుందన్నారు. ఈ సందర్భంగా వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉన్న 8 మందికి ప్లాస్టిక్ టబ్, సబ్బులు, తువ్వాలుతో పాటుగా ఆయింట్‌మెంట్‌తో కూడిన ప్రత్యేక కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి ఎస్.శ్రీను, వైద్య సిబ్బంది రామలక్ష్మి, సునీత, ఉమామహేష్, గణేష్, ఇందిర, లక్ష్మి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫస్టియర్ ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

మునగపాక, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో పాటిపల్లి ఏపీ మోడల్ స్కూల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి అర్హులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ వీపీఎస్.శ్రీలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రుపుల్లో చేరాలనుకునే వారు ఈనెల 17వ తేదీ నుంచి మే 22వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఓసీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ వర్గీయులు రూ.200, ఎస్సీ, ఎస్టీ వర్గీయులు రూ.150 దరఖాస్తు రుసుం చెల్లించాలన్నారు.

ఘనంగా మార్టూరు నూకాలమ్మ పండగ

అచ్యుతాపురం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మార్టూరు నూకాలమ్మ పండగ గురువారం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం ఐదు గంటల నుంచి అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు బారులు తీరారు. పసుపు, కుంకుమ, చీర, జాకెట్ అమ్మవారికి సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. కొందరు భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. భక్తులకు మంచినీరు, మజ్జిగ, పులిహోర పంపిణీ చేశారు. ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, మాజీ ఎమ్మెల్యే కన్నబాబు రాజు అమ్మవారిని దర్శించుకున్నారు. గురువారం రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో కేకే శ్రీనుబాబు, రమేష్‌బాబు, కేవీ రమణ, బాబ్జి బాబు, హరిబాబు, గుర్రం అప్పారావు, గుర్రం గోవింద్, మనోజ్ వర్మ, అచ్యుత రామరాజు తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో పూజలు

పాయకరావుపేటరూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాసాహెబ్‌పేటలో వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవంలో భాగంగా గురువారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత విగ్రహాలను ఊరేగించారు. అనంతరం వేద పండితులు పలు పూజలను నిర్వహించారు. శనివారం అన్న సమారాధన నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు తెలియజేశారు.

విద్యార్థినులకు బాక్సింగ్‌లో శిక్షణ

పాయకరావుపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థినులకు వ్యక్తిగత రక్షణలో భాగంగా పట్టణ పోలీసులు గురువారం స్థానిక ఎస్సీ బాలికల హాస్టల్ విద్యార్థినులకు బాక్సింగ్, తదితర వాటిలో శిక్షణ ఇప్పించారు. ఈ సందర్భంగా సీఐ జి.అప్పన్న ఆధ్వర్యంలో నేషనల్ బాక్సింగ్ చాంపియన్ రామకృష్ణతో విద్యార్థినులకు బాక్సింగ్, కరాటే, కుంగ్‌ఫూ తదితర వాటిలో శిక్షణ ఇప్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు స్వీయ రక్షణపై శిక్షణ

ఎస్.రాయవరం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): సెల్ఫ్ డిఫెన్స్ అనేది బాలికలకు ఎంతో అవసరమని ఎస్ఐ విభీషణరావు తెలిపారు. మండలంలోని తిమ్మాపురం కేజీబీవీ స్కూల్లో విద్యార్థినులకు గురువారం ఎస్ఐ ఆధ్వర్యంలో సెల్ఫ్ డిఫెన్స్‌పై శిక్షణ తరగతులు నిర్వహించారు. స్థానిక చందు తైక్వాండో ఇనిస్టూట్‌కు చెందిన ఇద్దరి నిపుణులతో సెల్ఫ్ డిఫెన్స్ పై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

నక్కపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో ప్రకృతి వ్యవసాయంపై గురువారం ఏవో ఉమాప్రసాద్ అవగాహన సదస్సు నిర్వహించారు. 2025 ఖరీఫ్ ప్రణాళికల గురించి వివరించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ప్రస్తుత కాలంలో ప్రజల ఆరోగ్య భద్రత, పర్యావరణ సంరక్షణ కోసం ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని సూచించారు. నవధాన్యాల సాగుపై వివరించారు. సమావేశంలో ఏపీఎం శ్రీనివాస్, ఏఈవో సాయికుమారి, ఆర్ఎస్‌కే సిబ్బంది రాజ్యలక్ష్మి, మౌనిక, కొండలరావు పాల్గొన్నారు.

పూడి ఆర్ఆర్ కాలనీలో దళితులపై చిన్నచూపు

- కలాసీల సంఘం అధ్యక్షుడు చందా ముసిలినాయుడు

అచ్యుతాపురం రూరల్, మార్చి 13, (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూడి ఆర్అండ్ఆర్ కాలనీలో గల దళితులపై వివక్ష చూపిస్తున్నారని పూడి అభ్యుదయ నిర్వాసితుల సంక్షేమ సేవా కలాసీల సంఘం అధ్యక్షుడు చందా ముసిలినాయుడు ఆరోపించారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పునరావాసం, శ్మశానం కేటాయింపు, కమ్యూనిటీ భవనం స్థలం ఆక్రమణ విషయాలలో దళితవాడకు అన్యాయం జరిగిందన్నారు. గ్రామస్తులతోపాటు భూములు కోల్పోయిన తమను మాత్రం పునరావాస కాలనీలో ఒక మూలన కేటాయింపు చేశారన్నారు. దళితులకు ప్రత్యేక కమ్యూనిటీ హాలును కూడా నిర్మించారని తెలిపారు. ఆ భవనానికి ఎదురుగా దానబోయిన సన్యాసిరావు అనే వ్యక్తి ఆక్రమించి సిమెంటు స్తంభాలు వేసి, చుట్టూ తీగెతో కంచె వేశాడన్నారు. ప్రభుత్వ భూమి కదా అని తాము ప్రశ్నించినా పట్టించుకోలేదన్నారు. అలాగే ఇళ్లకు ఆనుకుని శ్మశానం కోసం స్థలాన్ని ఏర్పాటు చేశారని ఆరోపించారు. శ్మశానాన్ని వేరేచోటకు మార్చాలని ఆయన కోరారు. పునరావాసంగా తమ మేజర్ కుమారులు, కుమార్తెలకు ఇవ్వాల్సిన ఇళ్ల స్థలాలను కేటాయించాలని ఏసీఐసీ అధికారులను కోరామని తెలిపారు.

ఏయూ మాజీ వీసీపై విచారణ

... 5వ పేజీ తరువాయి

వస్తాయని ఉద్యోగులు, విద్యార్థి సంఘాల నేతలు పేర్కొంటున్నారు.

ఆరోపణలు ఎన్నో...

- మాజీ వీసీ ప్రసాదరెడ్డి తన హయాంలో రిటైర్డ్ ప్రొఫె సర్లకు అడ్డగోలుగా పదవులు కట్టబెట్టారు. ఈ జాబితాలో మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కృష్ణమోహన్ ముందు వరుసలో ఉంటారు. పదవీవిరమణ తరువాత మూడు సార్లు ఆయనకు రిజిస్ట్రార్‌గా బాధ్యతలు కట్టబెట్టారు. ఆ తరువాత ఓఎస్ డీగా నియమించుకున్నారు. అనేక విభాగాల్లో ప్రిన్సిపాల్స్ డీన్లుగా, డైరెక్టర్లుగా పదవీ విరమణ చేసిన వారికి అవకాశం కల్పించారు.
- రూసా, పూర్వ విద్యార్థులు అందించిన నిధులు దుర్వినియోగం చేసినట్టు ఆరోపణలున్నాయి. భవన నిర్మాణాల్లో భారీగా నిధులు దుర్వినియోగం అయినట్టు ఫిర్యాదులు ఉన్నాయి.
- రిజిస్ట్రార్‌గా వర్సిటీతో సంబంధం లేని వ్యక్తికి అవకాశం కల్పించారు. ఇది నిబంధనలకు పూర్తి విరుద్ధమన్న ఆరోపణలు ఉన్నాయి.
- నిబంధనలకు విరుద్ధంగా టీడీఆర్ హబ్‌లో ప్రవేశాలు కల్పించినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఇందుకోసం భారీగా డబ్బులు చేతులు మారినట్టు ప్రచారం ఉంది.
- నార్త్ క్యాంపస్ పరిధిలో చిట్టడవిని తలపించేలా వేలాది వృక్షాలు ఉండేవి. అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయంటూ వాటిని తొలగించి, బయట వ్యక్తులకు కట్టబెట్టి నట్టు ఆరోపణలు ఉన్నాయి. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేయాల్సిన అవసరం ఉంది.
- వర్సిటీలో మొక్కల తొలగించిన ప్రాంతంలో మైదానాన్ని తయారుచేసేందుకు కొందరు బయటి వ్యక్తులు నిధులు ఇచ్చారు. ఎంత ఇచ్చారు?, ఎంత ఖర్చు చేశారన్నది ఎవరికీ తెలియదు. ఈ నిధులు వినియోగం లెక్క తేల్చాల్సి ఉంది.
- వాహనాలకు డీజిల్ బిల్లుల్లోనూ అడ్డగోలుగా మెక్కేసినట్టు ఆరోపణలు ఉన్నాయి. పాడైన వాహనాల విక్రయించడంలోనూ పెద్దఎత్తున అవకతవకాలు జరిగాయంటారు.
- వీసీ ఛాంబర్‌ను ప్రసాదరెడ్డి పూర్తిగా వైసీపీ కార్యాలయంగా మార్చేశారనే విమర్శలు వెల్లువెత్తాయి. అప్పటి సీఎం జగన్, దివంగత సీఎం రాజశేఖర్‌రెడ్డి, వైఎస్ విజయలక్ష్మి, అప్పటి ఎంపీ విజయసాయిరెడ్డి పుట్టినరోజు వేడుకలను ఛాంబర్‌లోనే జరిపారు.
- అనేక కోర్సులను పూర్తిగా ఎత్తేశారు. ఫీజులను ఇష్టానుసారంగా పెంచేశారు. తనకు నచ్చని ఎంతోమంది గెస్ట్ ఫ్యాకల్టీలను తొలగించారు.
- రాష్ట్రంలో మరే వర్సిటీలో లేనివిధంగా ఎయిడెడ్ ఫ్యాకల్టీని వర్సిటీలోకి తీసుకువచ్చారు. ఇందుకు భారీగానే వసూలు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి.

కరక కథ కంచికేనా!

... 5వ పేజీ తరువాయి

జరుగుతున్నది. అయితే జిల్లా అటవీ అధికారి శామ్యూల్ ఈ ప్రచారాన్ని కొట్టి పడేస్తున్నారు. పార్లమెంటులో బిల్లు ఆమోదం పొందితే తప్ప డీనోటిపై చేయడం సాధ్యం కాదని 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

సమాధానానికి సంతృప్తి చెందని అటవీ అధికారులు

కేంద్ర ప్రభుత్వ నిషేధాజ్ఞలు అమలులో ఉన్న కరక రిజర్వ్ ఫారెస్టులోకి ముందస్తు అనుమతి లేకుండా అడుగుపెట్టిన మైనింగ్ అధికారులకు, అటవీ శాఖ రేంజ్ అధికారి లక్ష్మీనర్సు గత నెలలో షోకాజ్ నోటీసులు ఇచ్చారు. పదిహేను రోజుల్లోగా సమాధానం ఇవ్వాలని పేర్కొన్నారు. అయితే మైనింగ్ అధికారులు ఇచ్చిన సమాధానానికి సంతృప్తి చెందని రేంజ్ అధికారి.. వారం రోజుల క్రితం మరో నోటీసు జారీ చేశారు. గార్డుకి చెప్పి కరక కొండ ఎక్కినట్టు మైనింగ్ అధికారులు సమాధానంలో పేర్కొన్నారని, గార్డుని విచారిస్తే.. తనను అడగలేదని అంటున్నాడని రేంజర్ తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, అటవీ శాఖ ఉన్నతాధికారుల నుంచి అనుమతులు ఉంటే తగిన ఆధారాలు చూపించాలని మైనింగ్ ఏడీని కోరారు. రెండో నోటీసుకి మైనింగ్ అధికారులు ఇచ్చిన సమాధానాన్నిబట్టి తదుపరి చర్యలు ఉంటాయని అటవీ అధికారులు అంటున్నారు.

టీడీపీ నేత అప్పలనాయుడు సస్పెన్షన్

అచ్యుతాపురం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి):పూడిమడక మేరుగు అప్పలనాయుడు(ఎంపీటీసీ సభ్యురాలు అరుణ భర్త)ను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్టు టీడీపీ గ్రామ అధ్యక్షుడు మేరుగు వెంకటరావు తెలిపారు. గురువారం పూడిమడకలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మేరుగు అప్పలనాయుడు భార్య అరుణ వైసీపీ తరపున ఎంపీటీసీ సభ్యురాలిగా గెలిచారని, 2024 ఎన్నికలకు మూడు రోజుల ముందు టీడీపీలో చేరారన్నారు. కూటమి తరఫున సుందరపు విజయకుమార్ ఎమ్మెల్యేగా విజయం సాధించిన దగ్గర నుంచి అప్పలనాయుడు సోషల్ మీడియాలో ఎమ్మెల్యేతోపాటు కూటమి నాయకులపై అసభ్యకర పోస్టులు పెడుతున్నారన్నారు. దీనిపై ఆధారాలతో రాష్ట్ర రహదారులు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లారన్నారు. పార్టీ అధిష్ఠానం ఆదేశం మేరకు అప్పలనాయుడుని టీడీపీ నుంచి సస్పెండ్ చేస్తున్నామని వెంకటరావు ప్రకటించారు. సమావేశంలో మేరుగు మహేష్, యజ్జల శ్రీరామ్ పాల్గొన్నారు.

కేజీబీవీని తనిఖీ చేసిన ఫుడ్ కమిషన్ సభ్యురాలు

నక్కపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక కేజీబీవీని గురువారం మధ్యాహ్నం రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యురాలు జి. దేవి తనిఖీ చేశారు. వంటగదిని పరిశీలించారు. మెనూ ప్రకారం బాలికలకు భోజనం పెడుతున్నారో.. లేదో.. తెలుసుకున్నారు. పిల్లలకు పెడుతున్న మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. తరగతి గదులను పరిశీలించారు. టెన్త్ బాలికలతో మాట్లాడారు. ఉత్తమ ఫలితాలు సాధించాలని, వత్తిడి లేకుండా టెన్త్ పరీక్షలు రాయాలని సూచించారు. ఆమె వెంట కేజీబీవీ ప్రత్యేకాధికారిణి సలీమా వున్నారు.



బాలికలతో మాట్లాడుతున్న రాష్ట్ర ఆహార కమిటీ సభ్యురాలు దేవి

అచ్యుతాపురం సంత ఆశీలు పాట రూ.10.11 లక్షలు

- గత ఏడాది కన్నా రూ.1.36 లక్షలు అధికం

అచ్యుతాపురం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం వారపు సంత ఆశీలు పాట రూ.10.11 లక్షలకు వెళ్లింది. స్థానిక పంచాయతీ కార్యాలయంలో గురువారం సంత ఆశీలు వేలం పాటను నిర్వహించారు. ఈపాటకు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గల్లా నాగమణి రూ.10.11 లక్షలకు పాడి వేలం పాటను దక్కించుకున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.8.75 లక్షలకు వెళ్లగా.. ఈసంవత్సరం రూ.1.36 లక్షలు అధికంగా పంచాయతీకి ఆదాయం వచ్చింది. కార్యక్రమంలో సర్పంచ్ కూండ్రసు విమల కుమారి, ఈవోపీఆర్డీ శ్రీరామనాయుడు, కార్యదర్శి శైలజారాణి, నాయకులు కూండ్రపు వెంకునాయుడు, ద్వారపురెడ్డి బాపూజీ పాల్గొన్నారు.

మహిళాభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

- మాజీ ఎంపీపీ ఆడారి మంజు

మునగపాక, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మాజీ ఎంపీపీ ఆడారి మంజు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో గురువారం విలేకర్లతో ఆమె మాట్లాడుతూ ఆర్థికంగా, రాజకీయంగా మహిళలకు టీడీపీ ఆది నుంచి అవకాశాలు కల్పిస్తూనే ఉందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తునే జగన్ పాలనలో వెనుకబాటుకు గురైన ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేస్తోందన్నారు. ఈ సమావేశంలో తెలుగు మహిళలు ఆడారి జానకి, నారాయణమ్మ, పెంటకోట స్వాతి, లోక సత్యవతి, భవాని, వీర మహిళ సరస్వతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ మంజు

ఉపాధి కూలీల బకాయిలు చెల్లించాలి

రాంబిల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీల బకాయిలను ప్రభుత్వం చెల్లించాలని సీపీఎం మండల కార్యదర్శి జి.దేముడునాయుడు డిమాండ్ చేశారు. గురువారం చినకలవలాపల్లి, కొతపేట గ్రామాల్లో సీపీఎం ప్రజా చైతన్యయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం దేముడునాయుడు మాట్లాడుతూ ఉపాధి కూలీలకు ఎనిమిది వారాలుగా వేతనం చెల్లించలేదని, వేసవి అలవెన్స్ ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో సీపీఎం కమిటీ సభ్యులు నాగుమంత్రి నారాయణరావు, ఎరిపెల్లి రాము పాల్గొన్నారు.

'జనసేన బైక్ ర్యాలీని విజయవంతం చేయాలి'

ఎలమంచిలి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాల్లో భాగంగా ఎలమంచిలి నుంచి పిఠాపురం వరకు నిర్వహించనున్న బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు బొద్దపు శ్రీను పిలుపునిచ్చారు. గురువారం ఆయన పార్టీ నేతలు పిట్టా శ్రీను, గుర్రాల శేఖర్ తదితరులతో కలిసి పట్టణ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవానికి పార్టీ శ్రేణులంతా క్రమశిక్షణతో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో పాల్గొనే విధానాలను వివరించారు. సమావేశంలోపార్టీ నేతలు ఝాన్సీ, కొఠారు నరేష్ పాల్గొన్నారు.

ఘనంగా వేణుగోపాలస్వామి ఆలయ ప్రతిష్ఠ

ఎలమంచిలి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తలిలో గురువారం వేణుగోపాలస్వామి ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ స్వామివారిని దర్శించి, పూజలు చేశారు. వేలాది సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, కూటమి పార్టీల నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



వేణుగోపాల స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

మంత్రులు, అధికారులను కలిసిన ప్రగడ

ఎలమంచిలి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో పలువురు మంత్రులు, అధికారులను రాష్ట్ర రహదారుల కార్పొరేషన్ సంస్థ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి వీరాంజనేయ స్వామి, శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, రెవెన్యూ మంత్రి సత్యప్రసాద్, మైనారిటీ, న్యాయ శాఖ మంత్రి ఎండీ. ఫరూక్‌లను వేర్వేరుగా మర్యాదపూర్వకంగా కలిశారు.



మంత్రి డోల బాల వీరాంజనేయను కలిసిన ప్రగడ నాగేశ్వరరావు

రామాలయ ప్రతిష్ఠ కార్యక్రమాలు

నక్కపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బండారువీధిలో పునరుద్ధరించిన కోదండరామాలయం ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు గురువారం నుంచి మొదలయ్యాయి. సీతా,రామ, లక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహాలకు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. శుక్రవారం ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

సాగునీటి కాలువల్లో పూడికతీత


కూలీలతో మాట్లాడుతున్న వేణుగోపాల్

కృష్ణాదేవిపేట, మార్చి 13(ఆంధ్రజ్యోతి): సాగునీటి కాలువల్లో పూడిక తీత పనులు చురుగ్గా సాగుతున్నాయి. శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు చొరవతో కృష్ణాదేవిపేట-బంగారంపేట కాలువకు రూ.4లక్షలు, ఏఎల్‌పురం-పాతకృష్ణాదేవిపేట కాలువకు రూ.4లక్షలు ఉపాధి హామీ పథకంలో మంజూరయ్యాయి. ఈ పనులను గొలుగొండ జడ్పీటీసీ మాజీ సభ్యులు చిటికెల తారకవేణుగోపాల్, ఛైర్మన్ మువ్వల సత్యనారాయణ, టీడీపీ నాయకులు గురువారం పరిశీలించారు. కల్వర్టు మరమ్మతులు త్వరలో చేయిస్తామన్నారు. దీంతో ఏళ్ల తరబడి పంట పొలాలకు పూర్తి స్థాయిలో సాగునీటి అందడం లేదని, కాలువల్లో పూడికతీత పనులతో తమ కష్టాలు తీరనున్నాయని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా అమ్మవారి పండగలు

మాకవరపాలెం, మార్చి13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్టిపాలెంలో డొడ కొండమ్మ అమ్మవారి పండగ, బయ్యవరంలో మూవుళ్లమ్మ పండగలు ఘనంగా నిర్వహించారు. గురువారం తెల్లవారు జాము నుంచి మహిళలు అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం పసుపు, కుంకులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. శెట్టిపాలెం సర్పంచ్ అల్లు రామునాయుడు బొడకొండమ్మను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో భజనలు, చిడతలు డాన్సులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

కేజీబీవీలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

మాకవరపాలెం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో నూతనంగా ప్రారంభించనున్న కేజీబీవీ-4 బోధనేతర సిబ్బంది హెడ్ కుక్, అసిస్టెంట్ కుక్ పోస్టులకు గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించినట్టు ఎంపీడీవో సీతామహాలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారదర్శకంగా ఇంటర్వ్యూలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు జూన్ ప్రసాద్, పీఎస్ఎన్ మూర్తి, మాకవరపాలెం హెచ్‌ఎం అచ్యుతరామయ్య పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

నాతవరం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో డి.యర్రవరంలో వివిధ పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన కరాటే పోటీల్లో యర్రవరం పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఎల్లో బెల్ట్ గ్రేడింగ్ టెస్టులో యర్రవరం సాంస్కృతి పాఠశాల విద్యార్థులు జెస్సిక, చరీస్ విన్సివిన్, గ్రేస్‌మిత, అశ్విన్ జోసెఫ్ ఉత్తీర్ణత సాధించారు. విజేతలను కరస్పాండెంట్ అంకంరెడ్డి గిరిబాబు, ప్రిన్సిపాల్ రేవతి పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి


అవగాహన కలిగిస్తున్నఅనకాపల్లి ప్రధాన సివిల్ జడ్జి ధర్మారావు

మాడుగుల రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : బాలికలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని అనకాపల్లి ప్రధాన సివిల్ జడ్జి ధర్మారావు అన్నారు. గురువారం మండలంలోని కస్తూర్బా విద్యాలయంలో మాడుగుల మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి, న్యాయవాదులు బాలికల చట్టాలను వివరించారు. బాలికల రక్షణకు ప్రభుత్వం , కోర్టులు, చట్టాలను మరింత పటిష్టం చేసాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు శ్రీనాధు ప్రసాదరావు, కేజీబీవీ ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

పోక్సో కేసులో ఇరుక్కుంటే భవిష్యత్తు నాశనం

దేవరాపల్లి: బాలికలతో అసభ్యంగా ప్రవర్తించి తే పోక్సో కేసులో ఇరుక్కుంటే జీవితాలు నాశనమవుతాయని చోడవరం సీనియర్ సివిల్ జడ్జి వి.గౌరీశంకరరావు హెచ్చరించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోక్సో చట్టంపై గురువారం విద్యార్థులకు అవగాహన కలిగించారు. ఏపీ లీగల్ సర్వీస్ అథారిటీ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. ఈ కార్య క్రమంలో ఎంఈఓ పడాల్ దాసు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫేర్‌వెల్ డే


వడ్డాదిలో కూచిపూడి నృత్య ప్రదర్శనలో చిన్నారులు

రావికమతం, మార్చి 13, (ఆంధ్రజ్యోతి): స్థానిక ఉన్నత పాఠశాల వార్షికోత్సవం,ఫేర్‌వెల్ వేడుకలు గురువారం సందడిగా జరిగాయి. ఈ సందర్భంగా ఐదేళ్లపాటు తమతో కలసి మెలసి చదువుకుని పాఠశాలను విడిచి వెళ్తున్న మిత్రులకు జూనియర్ విద్యార్థులు పరీక్షల మెటీరియల్‌ను అందజేశారు. పదో తరగతి విద్యార్థులు ఉపాధ్యాయుల ఆశీస్సులు పొందారు. సహపంక్తి భోజనాలు చేశారు. ఈసందర్భంగా విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ముందుగా పాఠశాలకు పూర్వ విద్యార్థులు ఆర్థిక సాయంతో నిర్మించిన కళా వేదికను పాఠశాల పేరెంట్ కమిటీ ఛైర్మన్ భూసాల అప్పారావు, ఉప సర్పంచి గంజి మోదునాయుడు, టీడీపీ నాయకులు వేపాడ నాగేశ్వరావు, హెచ్‌ఎం పి. మల్లికార్జునరావు, డి. సత్యారావు, ఉపాధ్యాయులు ప్రారంభించారు. విద్యార్థుల తల్లితండ్రులు, పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యప్రదర్శన

బుచ్చెయ్యపేట: వర్తక సంఘం ఆధ్వర్యంలో వడ్డాది జంక్షన్‌లో నిర్వహించిన చిన్నారుల కూచిపూడి నృత్యప్రదర్శన విశేషంగా అలరించింది. అనకాపల్లి, అగనంపూడినుంచి వచ్చిన ప్రదర్శించిన ఈ చిన్నారులు, వారి తల్లిదండ్రులను వర్తకసంఘ సభ్యులు, గ్రామపెద్దలు సత్కరించారు.

విద్యార్థులకు నగదు పురస్కారాలు

బుచ్చెయ్యపేట, మార్చి 13(ఆంధ్రజ్యోతి): వడ్డాది శ్రీ కేపీడీ జడ్పీహైస్కూల్‌లో గత ఏడాది పదో తరగతి పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు గురువారం నగదు పురస్కారం అందజేశారు. 1969నుంచి ఇప్పటి వరకు ఈ స్కూల్‌లో చదువుకున్న విద్యార్థులు ఓల్డ్‌స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పదిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన బి.నాగేశ్వరి, అడపా హర్ష, గేదెల అమృతలకు రూ.8వేలు, రూ.5వేలు, రూ.3వేలు చొప్పున అందించారు. అలాగే, కుబిరెడ్డి మానస, సకలా కార్తీక్, పప్పల మృదులకు రూ.5వేలు అందజేశారు. సంఘ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌వి.రమణ, కోవెల రవి, గౌరవ అధ్యక్షులు కోవెల జగన్నాథరావు, ఉపాధ్యక్షులు ఎస్. వర హాలుబాబు పాల్గొన్నారు.

నేడు శ్రీదేవి పెద్దింటమ్మ జాతర

రోలుగుంట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుసర్లపూడిలో శుక్రవారం శ్రీదేవి పెద్దింటమ్మ జాతర మహోత్సవానికి పూర్తి చేశారు. ఈ నెల 10న ప్రారంభమైన ఉత్సవాలు శుక్రవారం రాత్రితో ఘనంగా ముగియున్నాయి.

జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ సభకు తరలిరండి

» నియోజకవర్గ ఇన్‌చార్జి సూర్యచంద్ర


సమావేశంలో మాట్లాడుతున్న సూర్యచంద్ర

నర్సీపట్నం అర్బన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో శుక్రవారం జరగబోయే జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ సభకు పెద్దఎత్తున కార్యకర్తలు, నాయకులు తరలిరావాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజాన సూర్యచంద్ర పిలుపునిచ్చారు. గురువారం నర్సీపట్నంలో నాలుగు మండలాల ముఖ్యనాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆవిర్భావ సభ పండగ వాతావరణంలో జరగబోతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు చక్రవర్తి, ఎస్సీ సెల్ కన్వీనర్ కోన నారాయణరావు పాల్గొన్నారు.

కృష్ణాదేవిపేటలో..

పిఠాపురంలో శుక్రవారం జరగనున్న జనసేన పార్టీ 12వ ఆవిర్భావ సభకు నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివెళ్లి జయప్రదం చేయాలని ఆ పార్టీ గొలుగొండ మండలం ఉపాధ్యక్షుడు లంక సత్యనారాయణ, కృష్ణాదేవిపేట ఉపసర్పంచ్ దుంపలపూడి సత్యనారాయణ పిలుపునిచ్చారు.

బుధవారం రాత్రి పాతకృష్ణాదేవిపేటలో సభకు సంబంధించిన వాల్‌పోస్టర్లను నాయకులు, కార్యకర్తలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల నాయకులు చిన్ని, అనిశెట్టి గోపి, శ్రీను, శివాజీ, గణేష్, ప్రసాద్, పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఆర్టీసీ కార్మికుల ఆందోళన


డిపో గ్యారేజ్ గేట్ వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

నర్సీపట్నం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): అపరిష్కృతంగా ఉన్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎన్ఎం యూ ఆధ్వర్యంలో గురువారం ఆర్టీసీ డిపో గ్యారేజ్ గేట్ వద్ద ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఎన్ఎంయూ కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ ప్రజల అవసరాలకు సరిపడా బస్సులు తిప్పక పోగా ఉన్న ట్రిప్పులు తగ్గించేస్తున్నారని విమర్శించారు. ట్రిప్పులు తగ్గించి మిగులు సిబ్బంది ఉన్నారని చూపించి పక్క అనకాపల్లి డిపోలో విధులకు పంపుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు కోలా శంకరరావు, రమణ, శ్రీను, పీకేరావు పాల్గొన్నారు.

'చట్టాలపై అవగాహన పెంచుకోవాలి'


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి రోహిత్

నర్సీపట్నం అర్బన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : బాల బాలికలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని నర్సీపట్నం సివిల్ జడ్జి కోర్టు సీనియర్ న్యాయవాది రోహిత్ అన్నారు. గురువారం వేములపూడి జడ్పీ పాఠశాలలో బాలబాలికలకు పోక్సో చట్టం, బాలల చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో సోషల్ మీడియాతో అనేక దుష్ప్రభావాలు కలుగుతున్నాయన్నారు. బాలబాలికలు క్రమశిక్షణతో ఉంటే లక్ష్యాన్ని సాధించవచ్చునన్నారు. కార్యక్రమంలో రూరల్ సీఐ రేవతమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా మొల్లమాంబ జయంతి

కృష్ణాదేవిపేట, మార్చి 13(ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం చీడిగుమ్మల, కృష్ణాదేవిపేట గ్రామాల్లో కుమ్మరి శాలివాహన సంఘం ఆధ్వర్యంలో గురువారం కవయిత్రి మొల్లమాంబ 535వ జయంతిని ఘనంగా నిర్వహించారు. తొలుత మొల్లమాంబ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘం మండలాధ్యక్షుడు అంకాబత్తుల మాణిక్యం మాట్లాడుతూ కవయిత్రి మొల్లమాంబ చరిత్ర కుమ్మర్లకు గర్వకారణమన్నారు. తెలుగులో రామాయణం అనువాదించిన తొలిమహిళ మొల్లమాంబ అని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి కాజులూరి గోవింద, నాయకులు అంకాబుత్తుల శ్రీను, బుజ్జి, రాజు, అంబటి సూరిబాబు, తంగేటి బుచ్చిరాజు,అప్పలనర్సయ్య, ఈశ్వరరావు, అంబటి కోటేశ్వరరావు, దేవారపు రామేశ్వరావు పాల్గొన్నారు.

బీటీరోడ్డు క్వాలిటీపై శాంపిల్స్ సేకరణ


రోడ్డు క్వాలిటీని పరిశీలించిన ఈఈ ప్రసాద్

గొలుగొండ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): నాతవరం-గొలుగొండ మండలాలకు చెందిన లింకురోడ్డు నాణ్యతను క్వాలిటీ కంట్రోల్ ఈఈ యువీ. ప్రసాద్ గురువారం పరిశీలించా రు. అనంతరం బీటీ రోడ్డు శాంపిల్‌ను సేకరించారు. గొలుగొండ మండలం సాలికమల్లవరం నుంచి వెంకటాపురం వరకూ ఉపాధి హామీ పథకంలో రూ.80 లక్షలతో బీటీ రోడ్డును నిర్మించిందన్నారు. ఈ రోడ్డు క్వాలిటీని పరిశీలిస్తున్నామని, అనంతరం బిల్లులు మంజూరుకు ప్రభుత్వానికి నివేదిక అందిస్తామన్నారు. ఆయన వెంట క్వాలిటీ డీఈఈ బి.ఎర్రాపాత్రుడు, పీఆర్ డీఈఈ ఈశ్వరరావు పాల్గొన్నారు.

అర్హులందరికీ సబ్సిడీ రుణాలు : ఎమ్మెల్యే బండారు


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు

చీడికాడ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పేదలందరికీ సబ్సిడీ రుణాలు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనా రాయ ణమూర్తి అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న సంక్షేమ కార్య క్రమాలపై స్థానిక హైస్కూల్ ఆవరణలో నియోజకవర్గస్థాయి అవగాహన సద ్స్సు గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వివిధ శాఖల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పథకాలను, రుణాలను సద్వినియోగం చేసు కోవాలని కోరారు. అనంతరం జిల్లా వ్యవసాయ అధికారి మోహనరావు, డీఆర్‌డీఏ పీడీ సచీదేవి, డ్వామా పీడీ పూర్ణిమాదేవి, డీపీవో శిరీష, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి రామ్మోహన్‌రావు, జిల్లా మత్స్యశాఖ అధికారి ప్రసాద్, జిల్లా లీడ్‌బ్యాంక్ మేనేజర్ సత్యనారాయణ, తదితరశాఖల అధికారులు వారివారి శాఖల వారి వివరించారు. ఈ సదస్సులోకూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

కోటపాడులో కల్యాణ మండపం నిర్మాణం

కె.కోటపాడు: మండల కేంద్రంలో కోటి రూపాయ లు వెచ్చించి నిర్మించనున్న కల్యాణమండపానికి గురువారం స్థానిక ఎ మ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ప్రణవగోపాల్, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, వీఎంఆర్‌డీఏ అధికారులు స్థల పరిశీలన చేశారు. ప్రభుత్వ కార్యాలయాలు ఆనుకుని గతంలో ఆసుపత్రి ఏర్పాటుకు గ్రామస్థులు అర ఎకరం స్థలం కొనుగోలు చేశారు. ఆసుపత్రికి ఈ స్థలం అనుకూలంగా లేదని విడిచిపెట్టారు. దీంతో ఖాళీగా ఈ స్థలంలో వీఎంఆర్‌డీఏ నిధులతో కల్యాణ మండపం నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ప్రణవ గోపాల్‌సహకారంతో నియోజకవర్గంలో అనేక పనులు చేపడతామన్నారు. ముఖ్యంగా కె.కోటపాడు నుంచి చీడికాడ మండలం వాకపల్లి వరకు రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు. వీరి వెంట వెలమ కార్పొరేషన్ ఛైర్మన్ పీవీజీ కుమార్, వీఎంఆర్డీఏ జాయింట్ కమిషనర్ రమేశ్, చీఫ్ ఇంజినీర్ వినయ్‌కుమార్, సూపరింటెండెంట్ ఇంజనీర్ భవాని శంకర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాంబాబు, మాజీ సర్పంచ్ డోకల లక్ష్మీ నరసింహ మూర్తి, స్థానిక టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

భోజన పథకం బడ్జెట్ పెంచాలి

» కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు వరలక్ష్మి


గూనూరు వరలక్ష్మి

చోడవరం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పెరిగిన నిత్యావసర సరకుల ధరలకు అనుగుణంగా పాఠశాలల మధ్యాహ్న భోజన పథకం బడ్జెట్ పెంచాలని మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు గూనూరు వరలక్ష్మి డిమాండ్ చేశారు. గురువారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ, ప్రభుత్వాలు మారినప్పుడల్లా మెనూ మారుస్తున్నారని, కానీ రేట్లు మాత్రం పెంచకుండా ఆ భారాన్ని కార్మికులపైనే మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భోజన పథకం ప్రారంభించి 23 సంవత్సరాలు అవుతున్నదని, కార్మికులకు నెలకు రూ.3 వేలు మాత్రమే చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భోజన పథకం కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు, సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 18న ఛలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఆమె చెప్పారు.

కవియిత్రి మొల్లమాంబ జయంతి

బుచ్చెయ్యపేట: వడ్డాది కొత్తూరులో గురువారం కవియిత్రి మొల్లమాంబ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మొల్ల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ దొండా రాంబాబు, దొండా నారాయణమూర్తి, దొండా నరేష్, దాడి సూర్యనాగేశ్వరరావు, సంఘం అధ్యక్షులు సూర్యప్రకాశరావు, దొండా గిరిబాబు, పలువురు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్‌కు ప్రాధాన్యం: డీపీవో

చీడికాడ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో అన్ని పంచాయతీల్లో స్వచ్ఛ భా రత్‌కు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా పంచాయతీ అధికారి శిరీష ఆదేశించారు. చీడికాడలోని చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాన్ని గురువారం పరిశీలించారు. ఇళ్ల పన్ను వసూలు ఈ నెలాఖరులోగా పూర్తిచేయాలని ఆదేశాలు జారీచేశారు.

శ్రీనివాస్ రామానుజన్ విగ్రహం ఆవిష్కరణ

చీడికాడ, మార్చి13 (ఆంధ్రజ్యోతి) గ్రామాభివృద్ధికి తోడ్పాటునందిస్తామని ఉన్నత పాఠశాల స్థల దాత అయిన పాత్రుని జగ్గునాయుడు మనవడు నారాయణమూర్తి అన్నారు. తురువోలు హైస్కూల్‌లో ఏర్పాటు చేసి భారతీయ గణిత శాస్త్రవేత్త శ్రీనువాస్ రామానుజం విగ్రహాన్ని ప్రధానోపాధ్యాయులు రామకృష్ణతో కలిసి ప్రారంభించారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థుల తల్లి తండ్రులు పాఠశాల అభివృద్ధికి రూ. 20 వేలు, ఏపీటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి పాటూరి వరహా మూర్తి పదివేలు విరాళంగా ఇచ్చారు. జీపీనాయుడు తదితరులు పాల్గొన్నారు

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి


నరసింగరావు (ఫైల్ ఫొటో)

చోడవరం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడ్డూరు వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతిచెందాడు. సబ్బవరం మండలం ఆరిపాక గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ డెడ్డం నరసింగరావు (50) బుధవారం రాత్రి తొమ్మిదిన్నర గంటల సమయంలో సబ్బవరం వైపు నుంచి చోడవరం వైపు వస్తుండగా, అడ్డూరు వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ నరసింగరావు అక్కడికక్కడే మృతిచెందాడు. ఇతని భార్య నూకరత్నం, కుమార్తె పద్మ ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడి మృతి ఘటనలో నిందితుడిపై హత్య కేసు

చోడవరం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ స్థలంలో దుకాణం ఏర్పాటు విషయంలో తలెత్తిన వివాదంలో చిరువ్యాపారి ఇందలి సన్యాసిరావు మృతిచెందిన ఘటనకు సంబంధించి నిందితుడు నేమాల హరిపై పోలీసులు హత్య కేసు నమోదు చేశారు. స్థానిక పూర్ణా థియేటర్ సమీపంలో దుకాణం నిర్వహిస్తున్న చిరువ్యాపారి సన్యాసిరావు, తన దుకాణాన్ని కొంచెం వెనుకకు జరుపుకునే విషయంలో ఈ నెల 3వ తేదీన పంచాయతీ వార్డు సభ్యురాలి భర్త అయిన నేమాల హరితో వివాదం తలెత్తింది. ఈ క్రమంలో ఇరుపక్షాల వారు ఘర్షణ పడ్డారు. హరి బలంగా కొట్టడంతో తీవ్రంగా గాయపడిన సన్యాసిరావు విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతిచెందాడు. దీంతో హరిపై పోలీసులు హత్య కేసు నమోదు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దేవరాపల్లి, మార్చి13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలకు సరఫరా చేస్తున్న విద్యుత్ లైన్‌ల మరమ్మతులు చేపడుతున్నందున శుక్రవారం సరఫరాను ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్టు ఏఈఈ కర్రి శంకరరావు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రెండు బైక్‌లు దగ్ధం

దేవరాపల్లి, మార్చి13 (ఆంధజ్యోతి) మండలంలోని వాలాబు సమీపంలో గురువా రం జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు ద్విచక్ర వాహనాలు కాలి బూడిదయ్యాయి. చీడికాడ మండలంలోని కోనాం పంచాయతీ శివారు రెల్లల పాలెంలో జీడి తుప్పలు నరకడానికి వెళ్లిన పినబర్తి కళ్యాణం, కోమటి గంగరాజు కాలి బూడిదయ్యాయి. "గిరిజన గ్రామాల్లో జీడి తుప్పలు నరకడానికి వచ్చిన తామునష్టపోయినట్టు బాధితులు వాపోతున్నారు. తోటలకు అంటుకున్న మంటలు వ్యాపించి ఈ ప్రమాదం జరిగింది.

ఆశాజనకంగా చింతపండు ధర

చీడికాడ, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనాంలో గురువారం జరిగిన సంతలో చింతపండుకి మంచి ధర పలికింది. గత నాలుగు వారాలతో పోలిస్తే అధిక ధర లభించిండతో గిరిజనులు, గిరిజన రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మం డలంలో పలు గిరిజన గ్రామాలతోపాటు పాడేరు, అనంతగిరి, పెదబయలు, హు కుంపేట మండలాల్లోని గ్రామాలకు చెందిన రైతులు అటవీ ఉత్పత్తులు గురువారం కోనాం సంతకు తీసుకువచ్చి వి క్రయిస్తుంటారు. ప్రస్తుతం సీజన్ కావడంతో ఎ క్కువమంది కావిళ్లు, బుట్టలతో చింతపండు తెచ్చారు. మైదాన ప్రాంత వ్యాపారులు పోటీపడిమరీ చింతపండును కొనుగోలు చేశారు. గత వారం 20కిలోలు ధర రూ. 1400లు అమ్మగా, ఈ వారం 20కిలోల చింతపండు రూ. 1800 వరకు పలికింది. కి లోకి అదనంగా పది నుంచి రూ.15 ధర లాభించింది. ఈ సందర్భంగా పాడేరు మండలం డబ్బగరువు గ్రామానికి చెందిన చలుగు ఈశ్వరరావు మా ట్లాడుతూ, చింత పండుకు ధర లభించడం ఆనందంగా ఉందన్నారు.

చెట్టుపల్లిలో తాగునీటి సమస్యను పరిష్కరించాలి

నర్సీపట్నం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెట్టుపల్లిలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఎం నాయకుడు అడిగర్ల రాజు డిమాండ్ చేశారు. గురువారం గ్రామంలో ప్రజా చైతన్య యాత్రను నిర్వహించారు. ఎస్సీ కాలనీలో తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఆయన తెలిపారు. ట్యాంకర్‌తో నీటి సరఫరా చేయడం లేదన్నారు.కార్యక్రమంలో ఐద్వా నాయకురాలు సూర్యప్రభ, జి. గీతాకృష్ణ, విశ్వనాథం పాల్గొన్నారు.

కవయిత్రి మొల్లకు ఘన నివాళి



కవయిత్రి మొల్లకు నివాళులర్పిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్ తదితరులు

పాడేరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కవయిత్రి మొల్ల జయంతిని కలెక్టరేట్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. మొల్ల చిత్రపటానికి కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ తరతరాలు గుర్తుంచుకునేలా ఆమె రామాయణం రచన సాగించారని కొనియాడారు. యువత మొల్లను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.పద్మలత, సీపీవో పట్నాయన్, జిల్లా ఉద్యానవనాధికారి రమేశ్‌కుమార్‌రావు, డీపీఆర్‌వో పి.గోవిందరాజులు, జిల్లా పర్యాటకాధికారి జి.దాసు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏప్రిల్ 24 నుంచి ముత్యాలమ్మ జాతర



అమ్మవారు

చింతపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక ముత్యాలమ్మ జాతర ఏప్రిల్ 24 నుంచి 27 వరకు నిర్వహించనున్నట్టు పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఏటా అమ్మవారి జాతర గంధామవాస్యకు ముందు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. గత ఏడాది ఎన్నికల కోడ్ అమలులో ఉండడం వల్ల జాతరను నిర్వహించలేదన్నారు. ఈసారి అత్యంత వైభవంగా నిర్వహించాలని గ్రామ పెద్దలు నిర్ణయించారన్నారు. ఈమేరకు ఉత్సవ కమిటీ ఎంపిక కోసం ఈనెల 15తేదీ మధ్యాహ్నం అమ్మవారి ఆలయంలో గ్రామ సభను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు.

ఇళ్ల నిర్మాణాల పరిశీలన



మద్రేబ్ గ్రామంలో గిరిజనులు నిర్మిస్తున్న ఇళ్లను పరిశీలిస్తున్న వర్క్ ఇన్‌స్పెక్టర్ నగేశ్వరరావు

అనంతగిరి, మార్చి 13 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని పెదకోట పంచాయతీ తున్సీబ్, మద్రేబ్ గ్రామాల్లోని పీవీటీజీ గిరిజనులు నిర్మిస్తున్న ఇళ్లను వర్క్స్ ఇన్‌స్పెక్టర్ నగేశ్వరరావు గురువారం పరిశీలించారు. లబ్ధిదారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, మండల వ్యాప్తంగా 2021-22లో పీఎంఏవై గ్రామీణ్ పథకంలో 1114 ఇళ్లు.. 2023-24 లో పీవీటీజీ గిరిజనులకు 914 ఇళ్లు మంజూరైనట్టు చెప్పారు. పీవీటీజీ గిరి జనులకు ఇళ్లకు అదనంగా రూ. లక్ష, నాన్ పీవీటీజీ లబ్ధిదారులకు రూ.75 ప్రభుత్వం కేటాయించినట్టు చెప్పారు. గిరిజనులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలనికోరారు.

హైడ్రో పవర్ ప్రాజెక్ట్‌తో గిరిజన భూములకు నష్టం



పాదయాత్రలో మాట్లాడుతున్న జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు

అనంతగిరి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదకోట పంచాయతీ తముటు, రేగులపాలెం, కొండిబకోట, చింతలపాలెం గ్రామాల్లో సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన జనచైతన్య యాత్రలో భాగంగా జడ్పీటీసీ సభ్యుడు దీస రి గంగరాజు గురువారం పర్యటించారు. గిరిజనులను ఉద్దేశించి మాట్లాడారు. మండలంలో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ అనుమతులు వెంటనే రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్టు వల్ల ప్రత్యక్షంగా అనేకమంది గిరిజనులు భూములు నష్టపోతారని ఆందోళన వ్యక్తంచేశారు. కేబినెట్‌లో అనుమతులకు సంబంధించి తీర్మానాన్ని వెంటనే రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోహన్, సింహాద్రి, సురేశ్, గంగమ్మ, ఆదామ్మ, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వాసులకు ఎస్పీ హోలీ శుభాకాంక్షలు

పాడేరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజలకు జిల్లా ఎస్పీ అమిత్‌బర్దార్ గురువారం ఒక ప్రకటనలో హోలి శుభాకాంక్షలు తెలిపారు. హోలి పండుగ ప్రజల జీవితాల్లోనూ రంగులు విరియాలన్నారు. ఎల్లప్పుడూ సుఖ సంతోషాలతో ఉండాలని ఎస్పీ ఆకాంక్షించారు. అలాగే హోలీ వేడుకలో రసాయనాలతో కూడిన రంగులను చల్లుకోవద్దని సూచించారు.

ఓటర్లతో మర్యాదగా మెలగాలి

పాడేరురూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఓటర్లతో బీఎల్‌వోలు మర్యాదగా మెలగాలని తహసీల్దార్ వంజంగి త్రినాథరావు సూచించారు. మండలంలోని బీఎల్‌వోల ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా రూపకల్పన, స్వచ్ఛత కార్యక్రమాలకు తగినంత మంది బీఎల్‌వోలను నియమించినట్టు చెప్పారు. ప్రతీ బీఎల్‌వోకు 6, 6, 8 ఫారాల ప్రాధాన్యత అంశాలను వివరించారు. 1,200 మంది ఓటర్లకు పైగా ఉన్న పోలింగ్ కేంద్రాలను హేతుబద్ధీకరణ చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పి.పోలరాజు, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ కె.లక్ష్మణమూర్తి, వి.మోహనరావు, బి.భార్గవ్, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

'మన బడి- మన భవిష్యత్తు' పనులు వేగవంతం

» అధికారులకు కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ ఆదేశం



అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

పాడేరు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మన బడి- మన భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న పనులను వేగవంతం చేయాలని అధికారులను కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ ఆదేశించారు. జిల్లాలోని మన బడి- మనభవిష్యత్తు పనులపై గురువారం అధికారులతో కలిసి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ప్రధాన మంత్రి శ్రీ యోజనలో భాగంగా జిల్లాలో నిర్మిస్తున్న 23 పాఠశాలల పనులను ఏప్రిల్ నెలాఖరుకు ఎట్టి పరిస్థితుల్లో పూర్తి చేయాలన్నారు. అలాగే కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలకు చేపడుతున్న మరమ్మతు పనులు మే నాటికి పూర్తి చేయాలని, కొత్తగా మంజూరైన 33 పాఠశాలల భవనాలు, 75 అదనపు గదుల భవనాల నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. అందుకు గానూ మండల విద్యాశాఖాధికారులతో సంప్రతించి నిర్మాణాలకు గల అవకాశాలను గుర్తించాలన్నారు. పాఠశాలలకు సంబంధించి ప్రస్తుతం జరుగుతున్న వివిధ రకాల పనులన్నీ ఈ ఏడాది మే నెలాఖరుకు పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష అదనపు పీఎస్ స్వామినాయుడు, జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీరావు, సమగ్ర శిక్షా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నరసింహారావు, గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ శాఖ ఈఈలు జి.డేవిడ్‌రాజు, కె.వేణుగోపాల్, డీఈఈలే, ఏఈఈలు పాల్గొన్నారు.

కూటమి పాలనలో గిరిజన గ్రామాలకు రహదారుల నిర్మాణం

విజయనగరం రీజియన్ ఆర్టీసీ చైర్మన్ సియ్యారి దొన్నుదొర



:బస్కీ- కొర్రగుడ మార్గంలో కల్వర్టు పనులు పరిశీలిస్తున్న దొన్నుదొర

అరకులోయ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం మారుమూల గిరిజన గ్రామాలకు రహదారి ని ర్మాణాలకు అత్యధిక నిధులు మంజూరు చేసినట్టు విజయనగరం రీజియన్ ఆర్టీసీ చైర్మన్ సియ్యారి దొన్నుదొర అన్నారు. ఇటీవల డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ శంకుస్థాపన చేసిన బస్కీ, పంచాయతీ పరిధిలోని రోడ్డు నిర్మాణ పనులను టీడీపీ నేతలతో కలిసి ఆయన గురువారం పరిశీలించారు. ముందుగా దొన్నుదొరకు స్థానికులు స్వాగతం పలికారు. బస్కీ. నుంచి కొంత్రాయిగుడ-బిజ్జగుడ మీదుగా కొర్రగుడ వరకు 7 కిలోమీటర్ల రహదారి పనులను రూ. 3.6 కోట్లతో చేపడుతున్న నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమం త్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం, పంచాయతీ రాజ్‌శాఖా మం త్రి పవన్‌కల్యాణ్ ప్రతిష్టాత్మకంగా మారుమూల గిరిజన గ్రామాలు, కొండశిఖరాగ్ర గ్రామాల రహదారుల అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క రహదారి మంజూరు చేయలేదని ఆరోపించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అన్ని గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు. అభివృద్ధి పనులు నాణ్యతతో చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులను కోరారు. అలాగే, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇటీవల మన్యంలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారన్నారు. ఈ కార్య క్రమంలో వైస్ ఎంపీపీ రామన్న, బస్కీ సర్పంచి పాడి రమేశ్, పెసా కమిటీ ఉపాధ్యక్షుడు పాంగి రవి, ఎంపీటీసీ మాజీ సభ్యులు బలరాం, నూకరాజు, మాజీ సర్పంచులు కామరాజు,మాణిక్యం, సభాపతి, మాదల సర్పంచి శ్రీనివాసరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

'యువత పోరుబాట హాస్యాస్పదం'

జి.మాడుగుల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ తలపెట్టిన యువత పోరు నిరసన కార్య క్రమం హాస్యాస్పదంగా ఉందని టీడీపీ ఎస్టీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమెలి చిట్టిబాబు ఆరోపించారు. గురువారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. గత ఐదేళ్లలో జాబ్ క్యాలెండర్ ఊసెత్తకుండా వైసీపీ ప్రభుత్వం యువతను దారుణంగా మోసం చేసిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలు సంతృప్తితో ఉన్నారని స్పష్టం చేశారు. ఈ నెలలోనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌కు సన్నాహాలు చేస్తోందన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జీవో 3 రద్దు చేసినప్పుడు కనీసం రివ్యూ పిటిషన్‌కు దాఖలు చేయలేదన్నారు. ఇప్పుడు పోరుబాట కార్యక్రమం పూనుకోవడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బోయిని బాబురావు, ఎస్.కొండలరావు, రవి, సింహాచలం పాల్గొన్నారు.

ఏడీఎంహెచ్‌వోగా ప్రతాప్



ప్రతాప్

పాడేరురూరల్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిగా టీఎన్.ప్రతాప్ గురువారం బాధ్యతలు చేపట్టారు. జిల్లాలోని ముంచంగిపుట్టు మండలం లబ్బూరు పీహెచ్‌సీలో డిప్యూటీ సివిల్ సర్జన్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రతాప్‌ను ఆరోగ్యశాఖ చీఫ్‌సెక్రటరీ కృష్ణబాబు జిల్లా అదనపు వైద్య ఆరోగ్య శాఖాధికారిగా నియమించారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు కృషి చేస్తానన్నారు.

నేడు అరకులోయలో విద్యుత్ సరఫరా నిలిపివేత

అరకులోయ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): నిర్వహణ పనులు చేపడుతున్నందున అరకులోయ పట్టణం, పరిసరాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఏడీ అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. అరకులోయతో పాటు రవ్వలగుడ ఆర్.డుంబ్రిగుడ, పద్మాపురం, అరకు గ్రామ వినియోగదారులు సహకరించాలని కోరారు.

30మంది రక్తదానం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

అరకులోయ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం జరిగిన రక్తదానశిబిరం నిర్వహింరు. 30 మంది విద్యార్థుల నుంచి రక్తాన్ని సేకరించారు. అధ్యాపకురాలు కె.లక్ష్మీ, విద్యార్థినులు ఎం.రమాదేవి,హాసిని రక్తదానం చేసిన వారిలో ఉన్నారు. తొలుత ప్రిన్సిపాల్స్‌తో పాటు సీఐ హిమగిరి ఈ శిబిరాన్ని ప్రారంభించారు. జిల్లా రెడ్‌క్రాస్‌సొసైటీ వైస్‌చైర్మన్ ఎస్‌గంగరాజు, ప్రధాన కార్యదర్శి గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ శిబిరం అనంతరం సీఐ హిమగిరి, కళాశాలల ప్రిన్సిపాల్స్ భరత్‌కుమార్‌నాయక్,చలపతిరావు తదితరులు ఎన్ఎస్ఎస్ దత్తత గ్రామం గద్యాగుడను సందర్శించారు. ఎన్ఎస్ఎస్ పీవోలు విజయలక్ష్మి, అనితకుమారి,నాగబాబులు ఆధ్వర్యంలో నిరుపేదలకు రగ్గులు పంపిణీ చేపట్టారు.

స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తులు ఆహ్వానం

పాడేరురూరల్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): జిల్లా వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో స్వయం ఉపాధి పథకాలకు అర్హులైన లబ్ధిదారులు ఈ నెల 22వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని కలెక్టర్, జిల్లా వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం చైర్మన్ ఏఎస్ దినేష్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25ఆర్థిక సంవత్సరానికి బీసీ, ఈబీసీ, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ, కాపు(కాపు, తెలగ, బలిజ, ఒంటరి) కులాలకు చెందిన లబ్దిదారులు ఏపీ ఓబీఎంఎంఎస్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ఆయన కోరారు. వ్యవసాయ అనుబంధ, రవాణా, పరిశ్రమలు, సేవలు, వ్యాపార రం గాలలో స్వయం ఉపాధి పథకాలకు, బీఫార్మసీ, డి.ఫార్మసీ నిరుద్యోగ బీసీ, ఈడబ్ల్యూఎస్ యువతకు జనరిక్ ఫార్మసీలు, మేదర, కమ్మరి, సాలివాహన వృత్తి పనిచేస్తున్న కుటుంబాలకు ఆర్థిక సహాయం అందిస్తారన్నారు. బ్యాంకర్ల అనుమతితో రాయితీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న ఆదాయం పట్టణ ప్రాంతం వారికి రూ. లక్షా 3 వేలు, గ్రామీణ ప్రాంతం వారి ఆదాయం రూ. 81 వేలు లేదా అంతకంటే తక్కువ ఉండాలన్నారు. 21 నుంచి 60 ఏళ్ల లోపు వయస్సు కలిగిన వారు అర్హులన్నారు.

'హామీలు అమలులో ప్రభుత్వం విఫలం'



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

చింతపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని పాడేరు మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి డిమాండ్ చేశారు. గురువారం మండల కేం ద్రంలో పార్టీ కార్యకర్తలతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఎ న్నికల ముందు యువతకు 20 లక్షల ఉపాధి అవకాశాలు, నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి చెల్లిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ హామీలు నెరవేర్చాలని వైసీపీ నాయకులు యువజన పోరు నిర్వహించినట్టు చెప్పారు. ఈకార్యక్రమానికి యువత నుంచి మంచి స్పందన వచ్చిందన్నారు. అయితే కూటమి నాయకులు దీనిపై స్పందన కరువైందని అసత్య ప్రచారం చేయడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో స్థా నిక ఎంపీపీ కోరాబు అనుషదేవి, జీకేవీధి ఎంపీపీ బోయిన కుమారి, సర్పంచి దురియా పుష్పలత పాల్గొన్నారు.

మహిళా సంఘాల ఏర్పాటుకు నాబార్డు సహకారం



ఎంపీపీ రత్నకుమారిని సన్మానిస్తున్న ప్రతినిధులు

పాడేరురూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల ఏర్పాటుకు నాబార్డ్ సహకారం ఉం టుందని నాబార్డ్ డీడీఎం చక్రధర్, అమృత సం స్థ డైరెక్టర్ మురళీ అన్నారు. నాబార్డ్ సహకారంతో అమృత వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా వారోత్సవాలలో భాగంగా గురువారం మండలంలోని కిండంగి పంచాయతీ సేరిబయలులో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచంలో మహిళల ప్రాధాన్యత, వారి అభివృద్ధి, రక్షణ, సమాజంలో మహిళల పాత్ర తదితర అంశాలను వివరించారు. అనంతరం ఎంపీపీ ఎస్.రత్నకుమారి, కిండంగి స ర్పంచి కె.శ్రీలక్ష్మి, జిల్లా ఎస్పీ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ భాగ్యలక్ష్మి, మహిళా కానిస్టేబుల్ పీఎల్‌వీ వరావతి, స్పైస్ బోర్డు సీనియర్ ఫీల్డ్ ఆఫీసర్ కళ్యాణి, దంత వైద్యురాలు కనక, పశు వైద్య విద్యార్థిని ఎం.సౌజన్య, ఉత్తమ మ హిళా రైతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో 50 మంది మహిళా రైతులు, సంస్థ ప్రతినిధులు రవి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి



డి. రాంబాబు (ఫైల్)



నక్కా కృష్ణ (ఫైల్)

విశాఖపట్నం, మార్చి 13 (ఆంధ్ర జ్యోతి): కూర్మన్న పాలెం సమీపంలోని స్టీల్ సిటీ ఆర్టీసీ డిపో జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దువ్వాడ సమీపాన కొత్తూరులో నక్కా కృష్ణ (45), ద్రోణాద్రి రాంబాబులు కుటుంబాలతో నివాసముంటున్నారు. స్టీలుప్లాంటులో కూలీ పనులకు వెళుతుంటారు. బుధవారం రాత్రి సీ షిఫ్ట్ డ్యూటీకి వెళ్లి గురువారం ఉదయం ఒకే ద్విచక్ర వాహనంపై ఇంటికి తిరిగి వస్తుండగా కూర్మన్నపాలెం వద్ద అనకాపల్లి నుంచి గాజువాక వైపు అతి వేగంగా వెళుతున్న టిప్పర్ వెనుక నుంచి బలంగా ఢీకొంది. దీంతో బైక్‌పై ఉన్నవారు... ఆ సమయంలో పక్కనుంచి వెళుతున్న బస్సు కింద పడడంతో సంఘటనా స్థలంలోనే మృతిచెందారు. ఈ ప్రమాదంలో రోడ్డుపై వెళుతున్న పి.శ్రీను అనే అతను తీవ్రంగా గాయపడ్డాడు.

పీవీటీజీ గ్రామాల సమస్యలు పరిష్కరించాలి

పాడేరురూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పీవీటీజీ గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీపీఎం జిల్లా కమిటీ నాయకుడు పాలికి లక్కు డిమాండ్ చేశారు. ఈ మేరకు మోదాపల్లి పంచాయతీలోని వివిధ పీవీటీజీ గ్రామాల గిరిజనులు వంట్లమామిడి గ్రామ సచివాలయం వద్ద గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము చేపట్టిన ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా మండలంలోని మోదాపల్లి, మంట్లమామిడి పంచాయతీల పరిధిలోని పీటీజీ గ్రామాలను సందర్శించామన్నారు. ఈ క్రమంలో వం ట్లమామిడి సచివాలయానికి వెళ్తే అక్కడ అధికారులు ఎవరూ లేరని అన్నారు. అలాగే, పందిదుర్లు, గుర్రగరువు, బొర్రగొంది, కాంగెడ్డ గ్రామాల్లో ప్రజలనుంచి 73 దరఖాస్తులు వచ్చాయన్నారు. అధికారులు స్పందించి పీవీటీజీ గ్రామాల్లో రహదారి, తాగునీటి సమస్యలు, అర్హులకు అటవీహక్కుల పట్టాలు ఇవ్వాలన్నారు. అంత్యోదయ కార్డులు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల ప్రజలు శ్రీను, భాస్కరరావు, రాజు, మర్రి భాస్కరరావు, కేశవరావు, నాగేశ్వరరావు, చిన్నారావు, చిన్నయ్య, బాబూరావు, విజయ, కమల, బంగారమ్మ తదితరులు పాల్గొన్నారు.

అగ్రికల్చర్ డిప్లొమో విద్యార్థులు రాణించాలి



వీడ్కోలు సభలో మాట్లాడుతున్న ఏడీఆర్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి

చింతపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): అగ్రికల్చర్ డిప్లొమో పూర్తి చేసుకుంటున్న విద్యార్థులు అగ్రిసెట్‌లో ఉత్తమ ర్యాంక్‌లు సాధించేందుకు కృషి చేయాలని ఆచార్య ఎన్‌జీరంగా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థాన సహపరిశోధన సంచాలకులు (ఏడీఆర్) డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి అన్నారు. గురువారం పరిశోధన స్థానం సమావేశ మందిరంలో అగ్రికల్చర్ డిప్లొమో ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రథమ సంవత్సరం విద్యార్థులు, అధ్యాపకులు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఏడీఆర్ మాట్లాడు తూ ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే ప్రతి డిప్లొమో విద్యార్థి ఏజీ బీఎస్సీని అభ్యసించాలన్నారు. ప్రతి ఏడాది ఐదు నుంచి ఎనిమిది మంది విద్యార్థులు ఏ జీబీఎస్సీలో ప్రవేశాలు పొందుతున్నారన్నారు. అనంతరం ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె. బయ్యపురెడ్డి, ఓఏఎం డాక్టర్ పి. బాల హుస్సేన్ రెడ్డి, ఓఎస్ఏ బీఎన్ సందీప్ నాయక్, వార్డెన్ పి. జోగారావు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలి



టూరిజం డైరెక్టర్ రమేశ్‌నాయుడికి వినతి పత్రం అందిస్తున్న టీడీపీ నేతలు

ముంచంగిపుట్టు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలో పలు ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేయాలని కోరుతూ టీడీపీ నేతలు గురువారం టూరిజం డైరెక్టర్ కిల్లు రమేశ్‌నాయుడుకి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ మండల పరిధిలోని సుజనకోట, వనుగుమ్మ తదితర ప్రాంతాల్లో మత్స్యగెడ్డ పరివాహక ప్రాంతంలో దీవులను తలపించే గి రులు, నదీ పాయలు చూపరులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయన్నారు. వీటిని పర్యాటకంగా అభివృద్ధి చేస్తే స్థానిక నిరుద్యోగ యువతకు జీవనోపాధితో పాటు పర్యాటకుల తాకిడి పెరిగే అవకాశం ఉందని చెప్పారు. బురడగుంట, డుడుమ జలపాతాలను, జోలాపుట్టు జలాశయ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేయాలన్నారు. రమేశ్‌నాయుడు ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి అభివృద్ధి జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కె.బలరాం, ప్రధాన కార్యదర్శి కొంతేరి జగన్నాథ్, రాష్ట్ర ఎస్టీ సెల్ ఆర్గనైజేషన్ సెక్రటరీ జి.రామ్మూర్తి, సర్పంచి వి.లక్ష్మణ్, తెలుగు మహిళా నేత కె.సన్యాసమ్మ, చిన్నబాబు, రామారావు, పద్మానాభం, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణానికి కృషి: జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర



మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

ముంచంగిపుట్టు, మార్చి 13(ఆంధ్రజ్యోతి) : మారుమూల గిరి గ్రామాలకు పక్కా రహదారులు నిర్మాణం జరిగే విధంగా కృషి చేస్తానని విశాఖ ఉమ్మడి జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ జల్లి పల్లి సుభద్ర అన్నారు. మండలంలోని కుమడ, బూసిపుట్టు పంచాయతీల పరిధిలో పలు గ్రామాల్లో ఆమె గురువారం పర్యటించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలు గ్రామాలకు పక్కా రహదారి సౌకర్యంలేక అభివృద్ధి పథకాలకు దూరమౌతున్నామని, పీఎంజీవై గృహాలు మంజూరైనా కట్టుకోలేని పరిస్థితి నెలకొన్నట్టు కుమడ, బూసిపుట్టు ప్రాంత వాసులు జడ్పీ చైర్‌పర్సన్ దృష్టికి తీసుకువచ్చారు. గ్రామాల రహదారుల నిర్మాణానికి కృషి చేస్తానని ఈసందర్భంగా ఆమె హామీ ఇచ్చారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బూరుగుమెట్ట గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త బిసోమన్న కుటుంబాన్ని జడ్పీ చైర్‌పర్సన్ పరామర్శించి ఓదార్చారు. అధైరపడొద్దని అండగా ఉంటామని ఆ కుటుంబ సభ్యులకు ఆమె భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఎ.సీతమ్మ, వైసీపీ నేతలు జేవీవీస్ మూర్తి, పి.పద్మారావు, రమేష్, కమల, నీలకంఠం, సన్యాసిరావు పాల్గొన్నారు.

ఏయూ మాజీ వీసీపై విచారణ

... 5వ పేజీ తరువాయి

వస్తాయని ఉద్యోగులు, విద్యార్థి సంఘాల నేతలు పేర్కొంటున్నారు.

ఆరోపణలు ఎన్నో...

- మాజీ వీసీ ప్రసాదరెడ్డి తన హయాంలో రిటైర్డ్ ప్రొఫెసర్లకు అడ్డగోలుగా పదవులు కట్టబెట్టారు. ఈ జాబితాలో మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కృష్ణమోహన్ ముందువరుసలో ఉంటారు. పదవీ విరమణ తరువాత మూడు సార్లు ఆయనకు రిజిస్ట్రార్‌గా బాధ్యతలు కట్టబెట్టారు. ఆ తరువాత ఓఎస్‌డీగా నియ మించుకున్నారు. అనేక విభాగాల్లో ప్రిన్సిపాల్స్, డీన్లుగా, డైరెక్టర్లుగా పదవీ విరమణ చేసిన వారికి అవకాశం కల్పించారు.
- రూసా, పూర్వ విద్యార్థులు అందించిన నిధులు దుర్వినియోగం చేసినట్టు ఆరోపణలు ఉన్నాయి. భవన నిర్మాణాల్లో భారీగా నిధులు దుర్వినియోగం అయినట్టు ఫిర్యాదులు ఉన్నాయి.
- రిజిస్ట్రార్‌గా వర్సిటీతో సంబంధం లేని వ్యక్తికి అవకాశం కల్పించారు. ఇది నిబంధనలకు పూర్తి విరుద్ధమన్న ఆరోపణలు ఉన్నాయి.
- నిబంధనలకు విరుద్ధంగా టీడీఆర్ హబ్‌లో ప్రవేశాలు కల్పించినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఇందుకోసం భారీగా డబ్బులు చేతులు మారినట్టు ప్రచారం ఉంది.
- నార్త్ క్యాంపస్ పరిధిలో చిట్టడవిని తలపించేలా వేలాది వృక్షాలు ఉండేవి. అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయంటూ వాటిని తొలగించి, బయట వ్యక్తులకు కట్టబెట్టి నట్టు ఆరోపణలు ఉన్నాయి. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేయాల్సిన అవసరం ఉంది.
- వర్సిటీలో మొక్కల తొలగించిన ప్రాంతంలో మైదానాన్ని తయారుచేసేందుకు కొందరు బయటి వ్యక్తులు నిధులు ఇచ్చారు. ఎంత ఇచ్చారు?, ఎంత ఖర్చు చేశారన్నది ఎవరికీ తెలియదు. ఈ నిధులు వినియోగం లెక్క తేల్చాల్సి ఉంది.
- వాహనాలకు డీజిల్ బిల్లుల్లోనూ అడ్డగోలుగా మెక్కేసినట్టు ఆరోపణలు ఉన్నాయి. అదేవిధంగా పాడైన వాహనాల విక్రయించడం (స్క్రాప్)లోనూ పెద్దఎత్తున అవకతవకలు జరిగాయంటారు.
- వీసీ ఛాంబర్‌ను ప్రసాదరెడ్డి పూర్తిగా వైసీపీ కార్యాలయంగా మార్చేశారనే విమర్శలు వెల్లువెత్తాయి. అప్పటి సీఎం జగన్, దివంగత సీఎం రాజశేఖర్‌రెడ్డి, వైఎస్ విజయలక్ష్మి, అప్పటి ఎంపీ విజయసాయిరెడ్డి పుట్టినరోజు వేడుకలను ఛాంబర్‌లోనే జరిపారు.
- అనేక కోర్సులను పూర్తిగా ఎత్తేశారు. ఫీజులను ఇష్టానుసారంగా పెంచేశారు. తనకు నచ్చని ఎంతోమంది గెస్ట్ ఫ్యాకల్టీలను తొలగించారు.
- రాష్ట్రంలో మరే వర్సిటీలో లేనివిధంగా ఎయిడెడ్ ఫ్యాకల్టీని వర్సిటీలోకి తీసుకువచ్చారు. ఇందుకు భారీగానే వసూలు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి.

కరక కథ కంచికేనా!

... 5వ పేజీ తరువాయి

జరుగుతున్నది. అయితే జిల్లా అటవీ అధికారి శామ్యూల్ ఈ ప్రచారాన్ని కొట్టి పడేస్తున్నారు. పార్లమెంటులో బిల్లు ఆమోదం పొందితే తప్ప డీనోటిఫై చేయడం సాధ్యం కాదని 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

సమాధానానికి సంతృప్తి చెందని అటవీ అధికారులు....

కేంద్ర ప్రభుత్వ నిషేధాజ్ఞలు అమలులో ఉన్న కరక రిజర్వ్ ఫారెస్టులోకి ముందస్తు అనుమతి లేకుండా అడుగుపెట్టిన మైనింగ్ అధికారులకు, అటవీ శాఖ రేంజ్ అధికారి లక్ష్మీనర్సు గత నెలలో షోకాజ్ నోటీసులు ఇచ్చారు. పదిహేను రోజుల్లోగా సమాధానం ఇవ్వాలని పేర్కొన్నారు. అయితే మైనింగ్ అధికారులు ఇచ్చిన సమాధానానికి సంతృప్తి చెందని రేంజ్ అధికారి.. వారం రోజుల క్రితం మరో నోటీసు జారీ చేశారు. గార్డుకి చెప్పి కరక కొండ ఎక్కినట్టు మైనింగ్ అధికారులు సమాధానంలో పేర్కొన్నారని, గార్డుని విచారిస్తే.. తనను అడగ లేదని అంటున్నాడని రేంజర్ తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, అటవీ శాఖ ఉన్నతాధికారుల నుంచి అనుమతులు ఉంటే తగిన ఆధారాలు చూపించాలని మైనింగ్ ఏడీని కోరారు. రెండో నోటీసుకి మైనింగ్ అధికారులు ఇచ్చిన సమాధానాన్నిబట్టి తదుపరి చర్యలు ఉంటాయని అటవీ అధికారులు అంటున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పరవాడ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): వాడచీపురుపల్లి పంచాయతీలోని పోలిరెడ్డిపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎస్.రామకృష్ణ తెలిపారు. వాడచీపురుపల్లి, నాయుడుపాలెం, ముత్యాలమ్మపాలెం, దోసూరు, తిక్కవానిపాలెం పంచాయతీల్లో మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తామన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

కంపోస్టు యార్డును తరలించాలి

అనకాపల్లి టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ జోనల్ కార్యాలయ ఆవరణలో ఉన్న కంపోస్టు యార్డును తక్షణమే తరలించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం జోనల్ ఈ యార్డును పరిశీలించారు. అనంతరం పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కె.లోకనాథం మాట్లాడుతూ పట్టణంలోని చెత్త తీసుకువచ్చి కార్యాలయ ఆవరణలోవేయడం దేశంలో అనకాపల్లిలోనే చూస్తున్నామన్నారు. దీనివల్ల పట్టణమంతా దోమలతో నిండిపోయిందని, వ్యాధులు ప్రబలి ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కంపోస్టుయార్డుకు ఆనుకొని నివాస గృహాలు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల ఉన్నాయని యార్డు వల్ల వచ్చే దుర్వాసనలకు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు గంటా శ్రీరామ్, బి.ఉమామహేశ్వరరావు, అల్లు రాజు, కాళ్ల తేలయ్యబాబు, పి.చలపతి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దుర్గమాంబ పండుగ

పరవాడ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పి.బోనంగి పంచాయతీ కేంద్రంలో దుర్గమాంబ పండుగ గురువారం వైభవంగా జరిగింది. తెల్లవారుజాము నుంచే భక్తులు అమ్మవారి ఆలయం వద్ద బారులుతీరి, మొక్కుబడులు చెల్లించుకున్నారు. సాయంత్రం అమ్మవారి ఘటాలు గ్రామ వీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయం వద్ద అనుపోత్సవం నిర్వహించారు. సర్పంచ్ బండారు కల్పనా రాజశేఖర్ దంపతులతో పాటు మాజీ సర్పంచ్ రాయవరపు దేముడు, ఉప సర్పంచ్ గొంతిన రాము, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కె.సురేంద్ర మోహన్ అమ్మవారిని దర్శించుకున్నారు.

తుమ్మపాలలో ఉపాధి సభ

తుమ్మపాల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): తుమ్మపాల పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం ఉపాధి పథకం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ టి.పెంటయ్యనాయుడు మాట్లాడుతూ ఉపాధి పథకం ద్వారా గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణాలు చేపట్టామన్నారు. ప్రభుత్వ నిధులను సద్వినియోగం చేసుకుంటూ గ్రామాభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు చదరం నాగేశ్వరరావు, పంచదార్ల కన్నారావు, పంచాయతీ ఈవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

79వ వార్డులో హైమాస్ట్ లైట్ల ప్రారంభం

లంకెలపాలెం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధిలోని 79వ వార్డులో కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ గురువారం హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. లంకెలపాలెం జంక్షన్, ఎస్సీ కాలనీ, శ్మశానవాటిక, కరణంవీధి, శివానీనగర్, మరిడిమాంబ కాలనీ, వినాయకనగర్ ప్రాంతాల్లో లైట్లను ప్రారంభించారు. వార్డు పరిధిలోని అన్ని ప్రాంతాల్లో లైట్ల ఏర్పాటుతో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని ఈ సందర్భంగా కార్పొరేటర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు వై.కోటేశ్వరరావు, డి.రామారావు, రౌతు మూర్తి, కృష్ణ, నరసింగరావు, అర్జున్, అన్నపూర్ణ, మాలతి, జువ్వాలు, జి.రామారావు, నరసమ్మ పాల్గొన్నారు.

బయ్యవరంలో ఉత్సాహంగా ఫేర్‌వెల్ డే

కశింకోట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బయ్యవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు గురువారం ఫేర్వెల్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్యాలతో అలరించారు. అనంతరం హెచ్ఎం జీవీ.రమణ మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు జరగనున్న పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. అధిక శాతం మార్కులు తీసుకొచ్చి ఉపాధ్యాయులకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జేసుదాస్, రమేశ్, సరోజిని, వెంకటలక్ష్మి, రామునాయుడు, పుష్పలత, నాగేశ్వరరావు, ప్రసాద్, రత్నకుమార్, ఎస్.సత్యారావు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల అర్ధ నగ్న ప్రదర్శన

అనకాపల్లి టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): సమస్యలపై ఆర్టీసీ కార్మికులు గురువారం డిపో ఎదుట అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. అలాగే కాంప్లెక్స్ ఎదుట రిలే దీక్షలు కొనసాగించారు. టిమ్ డ్రైవర్లపై తనిఖీ అధికారుల వేధింపులు ఆపాలని, 1/2019 సర్క్యులర్ అమలు చేయాలని, 2019 సర్క్యులర్‌కు విరుద్ధంగా సస్పెన్షన్ చేసిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని నినాదాలు చేశారు. దీక్షల్లో ఎ.సునీత, ఎన్.లక్ష్మి, పీఆర్.లక్ష్మి, పి.సంతోషి కూర్చొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు కేఎస్‌వీ.రమేశ్, పి.సుధాకర్, ఏఎస్.రావు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

సబ్బవరం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): వివిధ కార్పొరేషన్ల ద్వారా స్వయం ఉపాధి రుణాలు మంజూరు చేసేందుకు లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎంపీడీవో పి.పద్మజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని బీసీ, కాపు, ఈబీసీ, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ కార్పొరేషన్లకు సంబంధించి లబ్ధిదారులకు వ్యవసాయం /అనుబంధ, రవాణా, పరిశ్రమలు, సేవలు, వ్యాపార రంగాల్లో రుణాలు ఇవ్వనున్నట్టు చెప్పారు. ఈ నెల 22వ తేదీ వరకు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

పొగాకుకు దూరంగా ఉండాలి

అనకాపల్లి టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు సూచించారు. ఎన్టీఆర్ వైద్యాలయం వద్ద గురువారం అవగాహన సదస్సు జరిగింది. సిగరెట్లు, పొగాకు ఉత్పత్తుల చట్టం-2003 అమలు ఆవశ్యకత, ఇతర అంశాలపై అవగాహన కల్పించారు. రాష్ట్ర కన్సల్టెంట్ పర్యవేక్షణలో పెరుగుబజార్, ఎన్టీఆర్ వైద్యాలయం కూడలి వద్ద పలు దుకాణాల్లో పొగాకు ఉత్పత్తులను పరిశీలించి, దుకాణదారులకు జరిమానా విధించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. పొగాకు ఉత్పత్తులు వినియోగించడం ద్వారా కలిగే అనర్థాలపై పోస్టర్ ప్రదర్శించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో రవికుమార్, ఎన్‌సీడీ పీవో జె.ప్రశాంతి, డాక్టర్ ఎన్.మోహనరావు పాల్గొన్నారు.

'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'ను విజయవంతం చేయాలి

» జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ప్రతీ ప్రభుత్వ కార్యాలయంలోనూ విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. శనివారం అన్ని కార్యాలయాల్లోనూ ఈ కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యంగా స్వీకరించాలని స్పష్టం చేశారు. అలాగే పట్టణాలు, గ్రామాలు, పార్కులు తదితర ప్రదేశాల్లో పరిసరాల పరిశుభ్రత కోసం పనులు చేపట్టాలని చెప్పారు. గ్రామ సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ సిబ్బంది సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై పూర్తిగా నిషేధం విధించామని ఆమె వెల్లడించారు. నిషేధిత ప్లాస్టిక్ అమ్మకాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థలు కూడా భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. సమావేశంలో డీఆర్వో సత్యనారాయణరావు, డీఆర్‌డీఏ పీడీ శశీదేవి, డ్వామా పీడీ పూర్ణిమాదేవి, డీపీవో శిరీషారాణి, పంచాయతీ రిసోర్స్ సెంటర్ కోఆర్డినేటర్ నాగలక్ష్మి, పీటీడీ జిల్లా అధికారి పద్మావతి, పాల్గొన్నారు.



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

విద్యార్థులకు పౌష్టికాహారం సక్రమంగా అందించండి

» రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు గంజిమాల దేవి

అనకాపల్లి టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పౌష్టికాహారం సక్రమంగా అందించాలని రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు గంజిమాల దేవి స్పష్టం చేశారు. అనకాపల్లిలోని మహాత్మాజ్యోతిబాపూలే ఏపీ బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలను గురువారం సందర్శించారు. రికార్డులు, ఆహార పదార్థాల నిల్వలు, నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల సంక్షేమానికి, ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. వారి కోసం అందిస్తున్న పథకాలు సక్రమంగా అమలు చేయాలన్నారు. విద్యార్థులతో మాట్లాడుతూ శతశాతం ఉత్తీర్ణత సాధించాలని, బాలికలు చక్కగా చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి కేవీఎల్ఎన్.మూర్తి, మహిళా, శిశు అభివృద్ధి, పాఠశాల విద్యా, ఫుడ్‌సేఫ్టీ, తూనికల కొలతల శాఖ అధికారులు పాల్గొన్నారు.



వంటకు సిద్ధం చేసిన సరకులను పరిశీలిస్తున్న దేవి

ముత్రాసు కాలనీలో అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన

కొత్తూరు: అనకాపల్లి మండలం మేజర్ పంచాయతీ కొత్తూరులోని ముత్రాసు కాలనీ మినీ అంగన్‌వాడీ కేంద్రాన్ని రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యురాలు జి.దేవి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థులకు అందజేస్తున్న పౌష్టికాహారం, గర్భిణులకు సరఫరా చేస్తున్న పోషకాహార కిట్లను తనిఖీ చేశారు. ప్రభుత్వం గర్భిణులు, బాలింతలకు ఉచితంగా ఇస్తున్న ఆహార పథకాలను అందరికీ అందేలా అధికారులంతా పర్యవేక్షించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీవో శశికళ, డీఎస్‌వో, ఎంఈవోలు పాల్గొన్నారు.

నూకాంబిక జాతర చాటింపు ప్రారంభం



చాటింపు ప్రారంభించిన రాంకీ

అనకాపల్లి టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఇలవేల్పు నూకాంబిక అమ్మవారి జాతర చాటింపు కార్యక్రమం గురువారం రాత్రి ప్రారంభమైంది. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రామకృష్ణ (రాంకీ) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ నెల 28వ తేదీ నుంచి నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర ప్రారంభం కానున్న నేపథ్యంలో భక్తులు ఇంటింటికీ వెళ్లి నూకాంబిక జాతర గురించి ప్రజలకు వివరించనున్నారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈవో ఎన్.సుజాత, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కన్నులపండువగా శ్రీవారి గరుడోత్సవం

అనకాపల్లి టౌన్: దేమునిగుమ్మం వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారు, అమ్మవారిని గరుడ వాహనంపై అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు పులకండం విజయ్‌బాబు, పులకండం గిరిబాబు ఆధ్వర్యంలో గురువారం రాత్రి నిర్వహించిన కోలాటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అన్నమాచార్య వాగ్గేయ వరదాయిని బృందాలు ఆలపించిన భక్తి గేయాలు అలరించాయి. కడిమిశెట్టివారి వీధిలో రాత్రి చోరసంవాదం కీలక ఘట్టం జరిగింది. అనంతరం ఊరేగింపుతో శ్రీవారు ఆలయానికి చేరుకున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బొలిశెట్టి శ్రీనివాసరావు, ఈవో టి.రాజసులోచన, అర్చకులు పి.ప్రసాద్‌బాబు, పి.రాజేశ్, ధర్మకర్తలు జి.మురళీ, వి.సూర్యప్రభ, సీహెచ్.నూకరాజు, ఎస్.తులసీ, కె.అరుణ, కె.వాసు తదితరులు పాల్గొన్నారు. దారి పొడవునా శ్రీవారిని దర్శించుకొని మంత్రముగ్ధులయ్యారు.

ఉత్సవమూర్తుల ఊరేగింపు

అనకాపల్లి టౌన్: పట్టణంలోని భోగలింగేశ్వరస్వామి ఆలయంలో పౌర్ణమి పాల్గుణ మాసం శుభ సమయాన గురువారం ఉత్సవమూర్తులను పుర వీధుల్లో పల్లకీలో ఊరేగించారు. ఆలయ చైర్మన్ కె.సత్యనారాయణ దేవస్థానం వద్ద ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గవరపాలెం పురవీధుల్లో ఊరేగింపు సాగింది. రాత్రికి వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య స్వామివారి కల్యాణం జరిగింది. ఆలయ ఈవో బి.మురళీకృష్ణ, ధర్మకర్తలు పి.గణేష్‌కుమార్, ఎం.నారాయణరావు, ఎం.సూరిబాబు, ఆర్.సంతోష్‌కుమార్, డి.సత్యవతి, బి.నాగేశ్వరరావు, అర్చకులు పి.నారాయణ పాల్గొన్నారు.

వైభవంగా ముత్యమాంబ అనుపోత్సవం



ముత్యమాంబ అమ్మవారిని దర్శించుకుంటున్న గండి బాబ్జీ

సబ్బవరం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంతకాపల్లి, బంగారమ్మపాలెం గ్రామాల్లో గురువారం ముత్యమాంబ అమ్మవారి అనుపోత్సవం వైభవంగా జరిగింది. పలు గ్రామాల నుంచి భక్తులు తరలివెళ్లి ఉదయం 5 గంటల నుంచే అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా బాణసంచా, కోలాటం, తప్పెడగుళ్ల, నేల డ్యాన్స్‌లతో అమ్మవారి ఘటాలు, పూల రథం ఊరేగించారు. అనంతరం అనుపోత్సవం నిర్వహించారు. రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన జరిగింది. బంగారమ్మపాలెంలో ఏపీ ఆయిల్ ఫెడ్ చైర్మన్ గండి బాబ్జీ, వంశీదీప్, వైసీపీ నేత గండి రవికుమార్, మాజీ ఎంపీపీ గండి దేముడు, అంతకాపల్లిలో మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డ అదీప్‌రాజ్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచులు ఎస్.నారాయణమూర్తి, డి.లావణ్య, కన్నంనాయుడు, రాజుకోటి, గొంప రమణ, జగన్నాథం, పలు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

కార్మిక శాఖ సహాయాధికారి సూర్యనారాయణ

సబ్బవరం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కార్మిక శాఖ సహాయాధికారి పి.సూర్యనారాయణ హెచ్చరించారు. మండలంలోని పలు ఇటుక బట్టీలు, దాబాలు, బట్టల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఆయా దుకాణాల్లో పనిచేస్తున్న సిబ్బందితో మాట్లాడి జీతం ఎంత ఇస్తున్నది ఆరా తీశారు. సప్తగిరి బట్టల దుకాణంలో పనిచేస్తున్న ఓ మహిళకు, అప్‌డేట్ ఫ్యాషన్స్‌లో పనిచేస్తున్న ఇద్దరు మహిళలకు నిబంధనల కంటే తక్కువ జీతం ఇస్తున్నట్టు గుర్తించారు. 18 ఏళ్ల లోపు బాలలను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ పి.రమణ, కార్మిక శాఖ జిల్లా సహాయాధికారి బాలకృష్ణ, సీడ్స్ చిన్నారావు, లోవరాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలో ప్రహరీ గోడ తొలగింపు

పరవాడ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పరవాడ రెవెన్యూ సర్వే నంబర్ 8లోని ప్రభుత్వ స్థలంలో నిర్మించిన ప్రహరీ గోడను తొలగించలని తహసీల్దార్ ఎస్వీ.అంబేడ్కర్ ఆదేశించారు. ఈ మేరకు గురువారం రెవెన్యూ సిబ్బంది తొలగించారు. పరవాడ గ్రామానికి చెందిన యువకుడు ఇదే విషయమై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై విచారణ జరిపిన రెవెన్యూ అధికారులు ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురైనట్టు నిర్ధారించారు. ఈ స్థలాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో వీఆర్వో బి.శ్రీనివాసరావు, తలయారీలు పాల్గొన్నారు.

డైట్ కళాశాలకు ఐఎస్‌వో ధ్రువీకరణ

అనకాపల్లి టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): డైట్ ఇంజినీరింగ్ కళాశాలకు ఐఎస్‌వో ప్రామాణిక ధ్రువీకరణ లభించింది. ఈ సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ విద్యావిధానంలో మార్పులు అవసరమన్నారు. ఎప్పటికప్పుడు టెక్నాలజీకి అనుగుణంగా విద్యాబోధన అందిస్తున్నామన్నారు. ఐఎస్‌వో ఆడిట్ టీమ్ కళాశాల విచ్చేసి రెండు రోజులు ఆడిట్ చేసిన తరువాత ఐఎస్‌వో సర్టిఫికెట్ మంజూరు చేయడమైందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.వైకుంఠరావు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు అడ్డుకోవాలని వినతి

సబ్బవరం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని దేవుడు చెరువుకు వరద నీరు పారే గెడ్డ వాగుల ఆక్రమణలను అడ్డుకోవాలని వార్డు సభ్యురాలు కొల్లి దేముడమ్మ కోరారు. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. కొంత కాలంగా దేవుడు చెరువుకు నీరు ప్రవహించే గెడ్డ వాగులు, ప్రభుత్వ భూములను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని చెప్పారు. అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని కోరారు.

అనకాపల్లిలో జనసేన నేతల బైక్ ర్యాలీ

కొత్తూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని జనసేన శ్రేణులు గురువారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రామకృష్ణ ప్రారంభించారు. అనంతరం రింగురోడ్డు నుంచి సత్యనారాయణ థియేటర్, సుంకరమెట్ట మీదుగా చిన నాలుగురోడ్లు, నెహ్రూచౌక్, ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి తిరిగి రామచంద్ర థియేటర్ అక్కడి నుంచి పెరుగుబజారు మీదుగా నూకాంబిక అమ్మవారి ఆలయానికి చేరుకుంది. అక్కడ ఏర్పాటు చేసిన నూకాంబిక అమ్మవారి ఘటాల ఊరేగింపును ఆయన ప్రారంభించారు. అనంతరం గవరపాలెం మీదుగా పరమేశ్వరి పార్కు వద్దకు చేరుకొని జనసేన పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమానికి కశింకోట, అనకాపల్లి మండలాల్లో ఉన్న జన సైనికులు జనసేన పార్టీ జెండాలతో హోరెత్తించాయి.

తేగాడలో మద్యం అమ్ముతున్న వ్యక్తి అరెస్టు

కశింకోట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): తేగాడ గ్రామంలో మద్యం అమ్ముతున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ ఎస్ఐ గణేశ్ తెలిపారు. బహిరంగ ప్రదేశంలో మద్యం విక్రయాలు చేస్తున్న ఎన్.కన్నాజీ 13 సీసాలతో పట్టుబడ్డారన్నారు. ఈ మేరకు అతనిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామని చెప్పారు.

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

సబ్బవరం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 17 నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షలకు సబ్బవరంలో ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఎంఈవోలు 1, 2 లక్ష్మణరావు, రవీంద్రబాబు గురువారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ఐదు పరీక్షా కేంద్రాలో 44 రూమ్‌లు ఏర్పాటు చేశామని, 989 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారని చెప్పారు. ప్రతీ రోజు ఉదయం 9.30 నుంచి 12.45 గంటల వరకూ పరీక్షలు జరుగుతాయని సూచించారు. లైట్లు, ఫ్యాన్‌లు, బెంచీలు వారు తెలిపారు.

చెప్పుల దుకాణంలో అగ్ని ప్రమాదం

» పూర్తిగా కాలిపోయిన సరకు

» పరవాడ సంతబయలు వద్ద ఘటన



దగ్ధమైన చెప్పుల దుకాణం

పరవాడ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం పరవాడ సంత బయలు వద్ద గల సాయిశ్రీ ఫుట్‌వేర్ (చెప్పులు) దుకాణంలో బుధవారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో దుకాణంలోని చెప్పులు, షూలతో పాటు స్టాండ్‌లు అగ్నికి ఆహుతయ్యాయి. దీనికి సంబంధించి పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం జిల్లాకు చెందిన పెంట భూషణరావు గత కొన్నేళ్లుగా పరవాడ సంతబయలు వద్ద సాయిశ్రీ ఫుట్‌వేర్ పేరుతో చెప్పుల దుకాణం నడుపుతున్నారు. ఎప్పటిలాగే బుధవారం రాత్రి 9.30 గంటలకు షాపు మూసివేసి ఇంటికి వెళ్లిపోయారు. అర్ధరాత్రి రెండు గంటల సమయంలో షాపులోంచి పొగ వస్తున్న దృశ్యాన్ని ఆ సమయంలో అటుగా వెళుతున్న ఓ వ్యక్తి గమనించి షాపు యజమానికి సమాచారమిచ్చారు. వెంటనే యజమాని అనకాపల్లి, రాంకీ అగ్నిమాపక కేంద్రాలకు సమాచారమివ్వడంతో వాళ్లు సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే దుకాణంలోని సామగ్రి పూర్తిగా కాలిబూడిదైంది. విషయం తెలుసుకున్న పరవాడ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సురేశ్, వీఆర్వో జి.సత్యనారాయణ సంఘటన స్థలానికి చేరుకున్నారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు. బాధితుడి నుంచి వివరాలు సేకరించారు. అలాగే చెప్పుల దుకాణాన్ని ఆనుకొని ఉన్న ఇంట్లోకి కూడా మంటలు వ్యాపించి విలువైన సామగ్రి దగ్ధమైంది.

విద్యుత్ సమస్యలను సత్వరమే పరిష్కరిస్తాం

» సీజీఆర్ఎఫ్ చైర్మన్ బి.సత్యనారాయణ

పరవాడ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని సీజీఆర్ఎఫ్ చైర్మన్ బి.సత్యనారాయణ స్పష్టం చేశారు. జవహర్‌లాల్ ఫార్మాసిటీలోని 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ కార్యాలయం ప్రాంగణంలో గురువారం విద్యుత్ సమస్యల ప్రత్యేక పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు ఇబ్బందులు తలెత్తితే తొందరగా పరిష్కరిస్తామన్నారు. సమస్యల పరిష్కారంలో అలసత్వం వహిస్తే సంబంధిత అధికారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా వినియోగదారులు లోవోల్టేజీ, విద్యుత్ స్తంభాల మార్పిడి, అదనంగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని వినతులు అందించారు. మొత్తం 20 ఫిర్యాదులు స్వీకరించారు. కార్యక్రమంలో సీజీఆర్ఎఫ్ ఆర్థిక విభాగం సభ్యులు షేక్ బాబర్, ఈపీడీసీఎల్ ఏడీ బోకం కనకారావు, సబ్ డివిజన్, సెక్షన్ కార్యాలయాల ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రాడ్యుయేట్లకు జర్మనీలో ఉద్యోగ అవకాశాలు

కొత్తూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): డిప్లొమా, డిగ్రీ పూర్తిచేసిన అభ్యర్థులకు జర్మనీలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఎన్.గోవిందరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని మెకట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్, ఎనర్జీ సిస్టం ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్ పూర్తిచేసిన వారికి జర్మనీలో ఉద్యోగాలు కల్పిస్తున్నామన్నారు. 18 నుంచి 40 ఏళ్ల లోపు యువత ఇందుకు అర్హులుగా పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారికి నాలుగు నెలల పాటు జర్మన్ భాషపై శిక్షణ ఉంటుందని, ఎ-2 ఎగ్జామ్ ఉత్తీర్ణత సాధించిన తరువాత జర్మనీకి పంపుతామని చెప్పారు. విజయవాడ, విశాఖపట్నంలో జర్మన్ భాషపై శిక్షణ ఉంటుందని, ఎంపికైన వారికి నెలకు రూ.2.5 నుంచి రూ.3.2 లక్షల జీతం ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 9988853335, 8712655686 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.